


Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.9
July 2025

5లో

## దేవుడు వాడుకొను మనుష్యుడు

# ఎవరి చేతిలో సాధనాలము?

తాము నమ్మిన సిద్ధాంతాలే తమ జీవిత సర్వస్వమని, సంపూర్ణంగా సమర్పించుకొని వాటికోసమే జీవించేవారు, పని చేసేవారు ఈ లోకంలో చాలామంది ఉన్నారు. ఒక యువకుడు కమ్యూనిస్ట్ సిద్ధాంతాలపట్ల తనకున్న సంపూర్ణ విశ్వాసం కారణంగా తన ప్రియురాలితో ఉన్న సంబంధాన్ని తెంచుకుంటూ ఆమెకు ఈ లెటర్‌ని రాస్తాడు. దీన్ని 'ది టేల్ ఆఫ్ ది టార్డీ ఆక్స్‌కార్ట్' అనే పుస్తకంలో ఛార్లెస్ ఆర్. స్విండాల్ కమిట్‌మెంట్ అనే అంశంలో ఈ లెటర్‌ను ప్రస్తావిస్తాడు.

"కమ్యూనిస్టులమైన మాకే విపత్తులు ఎక్కువగా కలుగుతుంటాయి. మమ్మల్ని కాలుస్తారు, ఉరి తీస్తారు, మా ఉద్యోగాల్ని పోగొట్టుకుంటాము. కష్టాలపాలవుతాము. మాలో చాలామందిని చంపేస్తారు లేదా జైలుపాలు చేస్తారు. కఠిన పేదరికంలో జీవిస్తాము. మేము బ్రతకడానికి అవసరమైన ధనం కంటే ఎక్కువగా ఉన్న ఒక్క రూపాయిని కూడా పార్టీకే ఇస్తాము.

మాకు సినిమాలకు, షికార్లకు, మంచి ఆహారానికి, ఉత్సవాలకు, మంచి ఇళ్ళకు, కార్లకు తగిన డబ్బుగానీ, సమయంగానీ ఉండదు. మమ్మల్ని పిచ్చివాళ్ళని అనుకుంటారు. అవును మేము పిచ్చివాళ్ళమే! మా జీవితాల్లో మేము పోరాడేది ఒకే ఒక్క గొప్ప ఆశయం కోసం. అదే ప్రపంచ కమ్యూనిజం. ఏ డబ్బుతోనూ కొనలేని జీవిత సిద్ధాంతాలు మాకున్నాయి. మా పోరాటానికో కారణం, మా జీవితానికో గమ్యం ఉంది. మానవ చరిత్రలోని ఈ గొప్ప ఉద్యమానికి మమ్మల్ని మేము అప్పగించుకుంటున్నాం. పార్టీకి విధేయులమై ఉండడం ద్వారా మా జీవితం కష్టంగా అన్పించినా లేదా మా భావాలు దెబ్బతిన్నా మనుష్యులకు మేలైన, సత్యమైన, నూతనమైన విధానాన్ని అందిస్తున్నామని చెప్పుకుంటాము.

నేను ఎంతగానో ఆరాటపడేది ఒకే ఒక్కదాని కోసమే. అది కమ్యూనిజం. అదే నా జీవితం, నా వ్యాపారం, నా వ్యాపకం, నా మతం, నా ఆరాటం, నా హృదయం, నా ఆహారం, పానీయం. పగలు దీని కోసమే పని చేస్తాను. రాత్రులు దీన్నే కలలు కంటాను. కాలం గడిచే కొద్ది ఇది నన్ను ఎదిగేలా చేస్తుందేగానీ తగ్గనివ్వదు. కాబట్టి, నా జీవితాన్ని నడిపే ఈ శక్తికి సంబంధం లేకుండా నేను ఏ స్నేహాన్ని, సంభాషణను కొనసాగించలేను. నా భావజాలాన్ని బట్టి నేనిప్పటికే జైలులో ఉన్నాను. అవసరమైతే, ఆయుధ పోరాటంలోనూ ముందుంటాను".

ఈ యువకుని విజన్, మిషన్, కమిట్‌మెంట్ క్రీస్తుకోసం కాదు, కమ్యూనిజం కోసం. కమ్యూనిజాన్ని ముందుకు తీసుకెళ్ళే సాధనంగా పని చేస్తున్నాడు. నిజ దేవున్ని ఎరుగని వారే అంత కమిట్‌మెంట్‌తో జీవిస్తూ, పని చేస్తుంటే యేసుక్రీస్తును దేవునిగా, రక్షకునిగా, ప్రభువుగా అంగీకరించిన మనం ఆయన పట్ల, ఆయన పని పట్ల ఇంకెంత కమిట్‌మెంట్‌తో ఉండాలి? క్రీస్తు కొరకు జీవిస్తూ, క్రీస్తు సువార్తను లోకానికి చాటే సాధనాలుగా పనిచేయవద్దా?

అపొస్తలుడైన పౌలు క్రీస్తు పట్ల, క్రీస్తు పరిచర్య పట్ల కమిట్‌మెంట్‌తో జీవించాడు. నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము (ఫిలిప్పీ 1:21), ఏవి నాకు లాభకరములై ఉన్నాయో వాటిని క్రీస్తు నిమిత్తం నష్టంగా ఎంచుకొన్నాను (ఫిలిప్పీ 3:7), క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని, గురి యొద్దకే పరుగెత్తాను (ఫిలిప్పీ 3:14) అని అంటాడు. క్రీస్తుకోసం కష్టం, నష్టం, అవమానం అనుభవించాడు. హింస, శ్రమలను సంతోషంగా సహించాడు. క్రీస్తు సువార్తను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్ళాడు. నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరును నన్నుపోలి నడుచుకోండి (1 కొరింథీ 11:1) అని ధైర్యంగా చెప్పాడు. క్రీస్తు కేంద్రిత జీవితాన్ని జీవించాడు. అందుకే ప్రభువు పౌలును బహుగా తన పనిలో వాడుకొన్నాడు. అన్యజనుల యెదుటను రాజుల యెదుటను ఇశ్రాయేలీయుల యెదుటను నా నామము భరించుటకు ఇతడు 'నేను ఏర్పరచుకొనిన సాధనమై' యున్నాడు అని ప్రభువు పౌలు గురించి చెప్పాడు (అపొ.కా. 9:15).

కమిట్‌మెంట్‌లో క్రీస్తు కేంద్రిత జీవితం, ఆయనపై సంపూర్ణ విశ్వాసం, వెల చెల్లించడానికి సంసిద్ధత కలిగిన మనస్సు, లక్ష్యం మీద దృష్టి నిలపడం, దానికి ఆటంకం కలిగించే ప్రతిదానిని, ఎంత గొప్పదైనా త్యజించటం మొదలగునవి ఉంటాయి. పౌలు వలె క్రీస్తు కోసం కమిట్‌మెంట్ కలిగి జీవించాలని దేవుడు మన నుండి ఆశిస్తున్నాడు. యుఇయస్‌ఐలోని పితరులు తమ జీవితాల్ని క్రీస్తు కేంద్రితంగా మలచుకొని, కమిట్‌మెంట్‌తో జీవించారు, దేవునిపనిని జరిగించారు. దేవుడు వారిని తన సాధనాలుగా ఏర్పరచుకొని విద్యార్థి లోకానికి ఆశీర్వాదకరంగా చేశాడు.

సమస్త మానవాళి పాపంలో పడడానికి ఆదామును, హవ్వను, ప్రభువును సిలువకు అప్పగించడానికి ఇస్కరి యోతు యూదాను, ఆదిమ సంఘాన్ని మోసపుచ్చడానికి అననీయ, సప్పీరాలను (అపొ.కా. 5:3) సాతానుడు తన సాధనాలుగా వాడుకొన్నాడు.

మనం ఎవరి చేతిలో సాధనాలుగా ఉండాలని కోరుకొంటున్నాం? ఎవరు ఉపయోగించుకోవాలని కోరుకొంటున్నాం? దేవుని పట్ల మన కమిట్‌మెంట్ ఏంటి? ప్రశ్నించుకొందాం, పశ్చాత్తాపపడదాం, ప్రభువుకు సమర్పించుకొందాం.

– పి. సునీల్ జాకబ్, అసోసియేట్ ఎడిటర్




Vol. 31, No. 9. July 2025
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Years) - Rs. 400
GRADUATES (3 Years) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**

CONTACT:

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

UPCOMING TOPICS:

August: Evangelism
September: Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# దేవునితో కలిసి పనిచెయ్యి

దేవుడు నీకు ఒక పనిని అప్పగించినప్పుడు దాని తీవ్రతను, గొప్పతనాన్ని గమనించి కృంగిపోవద్దు, ఆగిపోవద్దు. నీకిచ్చిన పనిని చేయడానికి తగిన రీతిలో సంసిద్ధ పరిచేవాడు మన దేవుడు. ఆయన నీకిచ్చిన గొప్ప పనిని చూసి అక్కడే ఆగిపోకు. యొర్దాను నది పారుతూ ఉండవచ్చు. యెరికో కోటగోడలు చాలా దుర్బేధ్యంగా ఉండవచ్చు. లోపలున్న వ్యక్తులు చాలా బలవంతులు కావచ్చు. కానీ ప్రభువైన దేవుడు యెహోషువాను తన పనిని చేయడానికి సంసిద్ధునిగా చేశాడు. యొర్దాను ప్రక్కనే నిలబడి ఆగిపోలేదు. దేవుని సహాయంతో దానిని దాటాడు. నీవు ఏ పని చేయాలని దేవుడు చెబితే ఆ పనిని నువ్వే చేయాలి. ఆయన నీకు ఏ పని అప్పగించాడో ఆ పనిని చేయడానికి అన్నిటినీ సమకూర్చేవాడు ఆయనే. ఏ భయం లేకుండా ఆయన మీద నమ్మకముంచు, ఆయనతో కలసి పనిచెయ్యి.

## లోపలి పేజీల్లో...

- ఎవరి చేతిలో సాధనాలము?- 2
- దేవునితో కలిసి పనిచెయ్యి - 3
- మార్పు - మంచి ముగింపు - 4
- దేవుడు వాడుకొను మనుష్యుడు - 5
- దేవుడు వాడుకొనే నాయకులు - 9
- దేవుని చేతిలో పనిముట్టుగా ఉండాలంటే? - 12
- సహవాసంలో అందరూ దేవునిచే వాడబడే పాత్రలా ఉండాలి - 15
- విభిన్నంగా జీవించు - 16
- పనికిరాని తీగెలు - 17
- త్యాగపూరిత సేవ - 19
- దిద్దుబాటు లేకపోయినా... - 22
- దేవుడిని వాడుకొనే మనుష్యులు - 23
- పరిచర్యలో సీనియర్ గ్రాడ్యుయేట్స్ పాత్ర? - 27
- దేవుడెందుకు బ్ర. భక్త్‌సింగ్‌ను ఇంతగా ఘనపరిచాడు? - 30
- ఔను ... మేమింతే - 32

# మార్పు – మంచి ముగింపు

"మీరు వెనకకు వెళ్ళి ప్రారంభాన్ని మార్చలేరు, గానీ మీరు ఉన్న చోట నుంచి ప్రారంభించి ముగింపును మార్చవచ్చు" అని అంటాడు గొప్ప క్రైస్తవ మేధావి సి.యస్. లూయిస్.

చాలామంది తమ ప్రస్తుత జీవితాన్ని చూసి గతంలో చక్కగా జీవించి ఉంటే, లేదా ఏదైనా పని చక్కగా ప్రారంభించి ఉంటే ప్రస్తుత పరిస్థితి చాలా బాగుండేదని నిరాశ, నిస్పృహలతో ఉంటారు. మంచి కుటుంబంలో పుట్టి ఉంటే, చిన్నప్పటి నుండి చక్కగా గైడ్ చేసే వారుంటే, అమ్మానాన్నలు మంచి సంపన్నులయితే లేదా విద్యాధికులైతే, ఉపాధ్యాయులు చక్కగా బోధించి ఉంటే, చిన్నప్పటి నుంచి మంచిగా చదువుకొని ఉంటే లేదా చక్కని క్రమశిక్షణ పాటించి ఉంటే...ఇలా చాలా విషయాల్లో గతం గూర్చి ఆలోచించి ప్రస్తుత జీవితాన్ని దుఃఖమయం చేసుకొన్నవాళ్ళు ఉంటారు. ఎవరైననూ క్రీస్తునందున్న యెడల వారు నూతన సృష్టి. సమస్తము దేవుని వలననైనవి అనే మాట ఒనేసిమును గూర్చి పౌలు ఇచ్చిన సాక్ష్యం చూస్తే స్పష్టం అవుతుంది. మన గతంతో సంబంధం లేకుండా మన గతిని మన గురువుగారు మార్చగలరు.



పారిపోయినవాడు – పరపతి, ప్రగతి సాధించాలన్నా

అపజయం పొందినవాడు – అద్వితీయ విజయాన్ని సాధించాలన్నా

ప్రభువు బిడ్డల ప్రాణాలు తీసేవాడు – ప్రభువు కొరకు, ఆయన పిల్లల కొరకు ప్రాణం పెట్టాలన్నా

ప్రయోజనం లేనివాడు – ప్రయోజకుడు కావాలన్నా

అనామకుడు – అధిరోహించాలన్నా

దొంగ – దొడ్డవాడు కావాలన్నా

విశ్వాసుల హృదయాలు – విశ్రాంతి పొందాలన్నా

వికసించిన హృదయాలు – విశేషమైన ఆదరణ పొందాలన్నా

ఇలా...ఏమి జరగాలన్నా – క్రీస్తే మన మనసులో వెలగాలి

ఆధునిక పౌలు, ఫిలేమోను, ఒనేసిములు ప్రభువు యొక్క రక్తంలోనుండే పుట్టుకొస్తారు. చరిత్రకారుని కొరకు చరిత్ర సృష్టిస్తారు, చరిత్రలో నిలిచిపోతారు. యుఇయస్ఐ కుటుంబ సభ్యులుగా నూతన సంవత్సరాన్ని ప్రారంభించిన మనం, మన గతంతో సంబంధం లేకుండా ఉన్న చోట నుండి ప్రారంభించి ముగింపును మారుద్దాం.

మన జీవితాన్ని తరచి చూసినప్పుడు మన ప్రారంభాలు దయనీయమైనవని గ్రహించి, ఉన్న చోటునుంచి ప్రారంభించి ముగింపును మారుద్దాం. మరో పౌలు, ఫిలేమోను, ఒనేసిములుగా మనం మన సహవాసంలో మారి – మార్పుకు మార్గదర్శకమవుదాం. మహోన్నతుని మనసులో మహా ఆనందం నింపుదాం!

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు




# దేవుడు వాడుకొను మనుష్యుడు

కెనడియన్ పాస్టర్, రచయిత, మిషనరీ అయిన ఆస్వాల్డ్ జె స్మిత్ తన జీవిత కాలంలో 80 దేశాలలో 12,000 కంటే ఎక్కువ ప్రసంగాలు చేశాడు, 35 పుస్తకాలు, 1,200 కవితలు రాశాడు. "దేవుడు మనకు అందమైన చర్చ్ భవనాలను నిర్మించమని చెప్పలేదు కానీ ప్రపంచానికి సువార్తను ప్రకటించమని చెప్పాడు, మనము దేవుని రెండవ రాకడను గురించి మాట్లాడుతున్నాము గానీ ప్రపంచంలో సగం మందికి క్రీస్తు మొదటిసారి వచ్చిన సంగతే తెలియదు" అంటూ ప్రేషిత సేవ అవసరత గురించి చెబుతూ, సువార్త పనికి తన్ను తాను సమ ర్పించుకొని దేవునిపనిలో విరివిగా వాడబడ్డాడు, అనేకుల్ని ప్రోత్సహించాడు.

ఆస్వాల్డ్ జె స్మిత్ తన గదిలో అటూ ఇటూ తిరుగుతూ "ఓ దేవా! నన్ను వాడుకో, నన్ను వాడుకో. ఎంతగా సమర్పించుకోవాల్సి వచ్చినా సరే, నేను సంతోషంతో సమర్పించుకొంటాను" అని ప్రార్థిస్తూ దేవునికి సమర్పించుకొనేవాడు.

క్రైస్తవ సేవలో దేవుడు వాడుకొను మనుష్యునికి ఉండాల్సిన లక్షణాలనుగూర్చి ఆలోచిస్తూ అవశ్యకమైనవి ఏడు ఉన్నట్లు ఆస్వాల్డ్ జే స్మిత్ గ్రహించి వాటిని 'దేవుడు వాడుకొను మనుష్యుడు' అనే తన పుస్తకంలో పొందుపరచాడు. వాటి సారాంశాన్ని ఈ వ్యాసంలో తెలుసుకొందాం. మన జీవితాన్ని పరిశీలించుకొందాం. సంపూర్ణంగా దేవునికి సమర్పించుకొందాం.

**1. జీవితములో ఒకే గొప్ప ఉద్దేశ్యముగల మనుష్యుని**

ద్విమనస్కులైనవారు సంపూర్ణంగా దేవుని తృప్తిపరచలేరు. అనేకమైన వాటిమీద శ్రద్ధగల వారు దేనిలోనైనా అరుదుగా జయము పొందుతారు. ఒకడు వ్యాపారంలో లాభము సంపాదింపగోరితే అతడు ఎక్కువ సమయాన్ని, తన ఆలోచనంతటిని దానిమీదే ఉంచాలి. ఒకడు ఆఫీసులో పని చేస్తూ, జూదముపై మనస్సు నిలిపితే వాడు అపజయం పొందుతాడు. ఒకడు తన భార్యను, మరొక స్త్రీని ప్రేమిస్తే వాని దాంపత్య జీవితంలో తగాదాలు ఉంటాయి.

దేవుడు వాడుకొను మనుష్యుడు తన హృదయంలో అన్నిటికంటె దేవునికి ప్రథమ స్థానమిచ్చి తన ధ్యాసంతటిని సేవమీదే ఉంచాలి. వేరే వాటికి అతని హృదయంలో చోటు ఉండకూడదు. "ఒకటి చేయుచున్నాను" అని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 3:13). ఆయన జయము యొక్క రహస్యమిదే గదా?

నీవు ఆయనకు లోబడ్డావా? నిత్యము దేవునికి 'అవునని', స్వార్థానికి 'లేదు' అని చెప్పావా? నిన్ను నీవు ప్రతిష్ఠించుకొన్నావా? నీకు కలిగిన సమస్తము ఆయనకు అప్పగించుకొన్నావా? నీ జీవితంలో నీ చిత్తాన్ని పక్కకు పెట్టి ఆయన చిత్తాన్ని అంగీకరించావా? ఆయన కోరే స్థలానికి నీవు వెళతావా? ఆయన నిన్నుంచగోరు స్థితిలో నీవు ఉంటావా? 'నా జీవితాన్ని తీసుకో' అని నీవు నిజంగా, హృదయపూర్వకముగా చెప్పగలవా?

సువార్తను ప్రకటించాలనే గొప్ప వేదన ఆయనలో ఉంది. దివారాత్రులు ఆయన ఆ పనిలోనే గడిపాడు. ఆయన తిమోతికి రాస్తూ "వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుము" (1 తిమోతి 4:15) అని ఆజ్ఞాపించాడు.

నేటి మనుష్యులు - అనేకమైన వాటియందు శ్రద్ధగలిగి ఉండడం వలన దేవుడు వారిని వాడుకొనుట లేదు. కళాశాలలలోని విద్యార్థులు లోకసంబంధమైన వాటియందు, తోటి బాలికల స్నేహములయందు మనస్సుంచుటవలన వారి జీవితాలు సరైనవిగా లేకపోవడం నేను చూశాను. ఏ యవ్వనస్థుడైనను తన సమయాన్ని ఎడతెగక స్త్రీ సహవాసంలో గడిపితే దేవుడు అట్టివానిని ఎన్నడును గొప్పగా వాడుకోడు.

బోధ పనితోపాటు వేరు పనిని కూడా చేసేవారి ని నేనెరుగుదును. వారు వారి సమయమంతటిని సేవకివ్వడంలేదు. నేను సేవలోకి రాకముందు వ్యాపారంలో ఒక భాగస్థునిగా ఉన్నాను. కానీ సేవకునిగా పట్టాభిషేకం నొందిన తర్వాత నా ధ్యానమంతటిని నా పనిలో నుంచుటకై నేను దానిని త్వరగా అమ్మివేశాను. జీవితంలో యితర విషయాలతో ఏ మాత్రము సంబంధము ఉండకూడదని నేను బలవంతం చేయడం లేదు. నీవు తప్పక ధ్యానముంచాల్సిన పనులు నీకుండును. అయితే నేను నొక్కి చెప్పేదేంటంటే అట్టివి బహు కొద్దిగా ఉండాలి. నీవు వాటికి రెండవ స్థానమిచ్చి, దేవునికి, ఆయన సేవకు ప్రథమ స్థానమివ్వాలి. అదే నీ జీవితోద్దేశంగా భావించాలి.

## 2. దేవుని కృపవలన తన జీవితంలోని ప్రతి ఆటంకాన్ని తొలగించుకొనే మనుష్యుని

దేవుడు నిన్ను వాడుకొనకుండా ఏదైనా నిన్ను ఆటంకపరుస్తుందని నీవు నాతో చెప్పాల్సిన అవసరం లేదు. అది దేవునికి, నీకు తెలుసు. నిన్ను నీవు



చక్కబరచుకోవాలి. అదొక భారమైన పాపమైనా, అపవిత్రపు తలంపు, మాట, క్రియయైనా లేక గర్వము, అసూయ, ద్వేషము, ధనాపేక్ష, అవిశ్వాసము, చెడ్డ అలవాట్లు లేక మరేదైనను సరే దేవుడు నిన్ను వాడుకొనక ముందు నీవు దానిని తీసివేయాలి. ఇశ్రాయేలీయులు అపజయం పొందడానికి ఆకాను కారకుడని జ్ఞాపకముంచుకో. నీ హృదయంలో ఆకాను ఉన్నాడా? నీ హృదయంలో దేవుడు తప్ప ఇతరులెవ్వరు చూడలేని పాపమున్నదా? నీవు బయటకెలా కనబడతావో లోపలను అట్టివాడవేనని మనుష్యులు అనుకొందురు. అయితే నీ నిజస్థితి వారెరుగరు. నీవు తెరను తీసివేసి వారు నీలోని సమ-స్తమును చూచునట్లు చేయాలి (యెషయా 5:1,2).

## 3. పూర్తిగా తన్ను తాను దేవుని స్వాధీనం చేసికొన్నట్టి మనుష్యుని

మనమందరం దేవునికి భయపడి, మన జీవితం మీద ఆయనకు సర్వాధికారమిస్తూ నడుచుకోవాలి. "ఎవడైనను ఆయన చిత్తమును నెరవేర్చగోరినయెడల" అని దేవుడు చెప్పుచున్నాడు. మట్టి లోబడకపోతే కుమ్మరివాడేమి చేస్తాడు? రోగి నమ్మకపోతే వైద్యుడేమి చేస్తాడు? అవిధేయులైన సైనికుల వలన ఏమి ప్రయోజనం? నిర్దోష మార్గమందు నడచువారు నాకు పరిచారకులగుదురు. (కీర్తనలు 101:6).

నీవు ఆయనకు లోబడ్డావా? నిత్యము దేవునికి 'అవునని', స్వార్థానికి 'లేదు' అని చెప్పావా? నిన్ను నీవు ప్రతిష్ఠించుకొన్నావా? నీకు కలిగిన

సమస్తము ఆయనకు అప్పగించుకొన్నావా? నీ జీవితంలో నీ చిత్తాన్ని ప్రక్కకు పెట్టి ఆయన చిత్తాన్ని అంగీకరించావా? ఆయన కోరే స్థలానికి నీవు వెళతావా? ఆయన నిన్నుంచగోరు స్థితిలో నీవు ఉంటావా? 'నా జీవితాన్ని తీసుకో' అని నీవు నిజంగా, హృదయపూర్వకముగా చెప్పగలవా?

"ప్రభువా నన్ను నేను నీకు అప్పగించు కొనుచున్నాను; స్నేహితులు, సమయము, ఈ లోకపు ఆస్తి, జీవము, దేహము, సదాకాలము సంపూర్ణముగా నీవై ఉండునుగాక!"

## 4. ప్రార్థనలో జయము పొందడం నేర్చుకొన్న మనుష్యుని

దేవుడు గొప్పగా వాడుకొన్న మనుష్యులందరూ ప్రార్థనాపరులే. "నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నిన్ను పోనియ్యను" అని యాకోబు అన్నాడు. "నీవు దేవునితోను మనుష్యులతోను పోరాడి గెలిచితివి" అని దేవుడు చెప్పాడు.

యేసు ఎక్కువ పని ఉన్నా, సేవకొరకై అనేక అవకాశాలున్నా జనసమూహాలను విడిచి ఏకాంతంగా ప్రార్థించడానికి వెళ్ళాడు. కొన్నిసార్లు రాత్రంతా తన తండ్రితో గడిపాడు. ఆయన ఎంతో వేదనతో ప్రార్థించినందున చెమట రక్తముగా మారింది. దేవునిచే వాడబడిన ప్రతి మనుష్యుని యొక్క అనుభవమిదే. ఆ విధంగా సమర్పించుకోవడానికి నీవు ఇష్టపడుచున్నావా?

ఆశ్చర్యకరమైన వరాలు, దేవుని సేవకు అవసరమైన వాటినన్నిటిని నీవు కలిగియుండవచ్చు. అయితే నీవు ప్రార్థనలో పోరాడడం, జయమొందడం నేర్చుకోకపోతే నీ సేవలో దేవుని ఆశీర్వాదం కల ుగుతుందని నీవెన్నడూ తలంచకూడదు. అట్టి జయకరమైన ప్రార్థన చేయడానికి, ఉద్దేశించినదానిని పొందే ప్రార్థన చేయడానికి, రహస్య స్థలానికి వెళ్ళాలని నేను ప్రతి ఒక్కరిని బలవంతం చేస్తున్నాను. మనం ప్రార్థించి జవాబును పొందాలి.

## 5. వాక్యము నేర్చుకోవడానికి పట్టుదలతో చదివే మనుష్యుని

దేవుని వాక్యము నీ యొక్క ఆయుధం. దాని బలాన్ని గూర్చి నీవు సందేహిస్తే దానిని వినియోగించడంలో నీకేమి శక్తి కలుగుతుంది? నీవు విషయాలను తెలుకోవడానికి నీకాధారమిదే. దేవుని వాక్యము నీకు భోజనమును, పానమునై ఉన్నది. అనుదినము నీవు శ్రద్ధగా దానిని చదివినప్పుడే, అది నీలో ఒక భాగమైనప్పుడే ఆయన చిత్తానుసారముగా నీవు దానిని వాడుకొనగలవు; లేకపోతే ఆయన చిత్తానుసారంగా వాడుకొనలేవు. నీవు ప్రకటించే వాక్యము జీవముగలదై, దైవ ప్రేరితమై ఉన్నదని నీవు నమ్ముచున్నావా? అది ఎన్నటికిని వట్టిగా తిరిగి రాదని నమ్ముచున్నావా? తన వాక్యమును సందేహించు మనుష్యుని దేవుడు వాడుకొనడు.

## 6. నశించిపోయే లోకానికి ప్రాణాధారమగు జీవంతో కూడిన వర్తమానంగల మనుష్యుని

నీవు దూరాన ఉన్న సువార్త పొలాన్ని చూస్తున్నావు. సరే. నీవు వారికేమి చెబుతావు? నీకొక వర్తమానం ఉందా? నీవెందుకు వెళ్తున్నావు?

నీ పని కేవలం సంఘసేవ, విద్య, సంస్కరణ మాత్రమే అయితే నీవు వాటిని సంఘ సేవయందు నేర్పుగలవానికి, బడి పంతులుకు, రాజకీయముల నెరిగినవారికి, సంస్కరణ కర్తకు విడిచిపెట్టాలి. నాగరికతను ప్రవేశపెట్టగోరినయెడల, దేశాభ్యుదయము కొరకై నియమింపబడిన ప్రభుత్వ శాఖలకు నీవు వాటిని విడిచిపెట్టవలెను. మనము మన ఇళ్ళు విడిచి దూర ప్రాంతాలకు పోయి హింసను, ఎగతాళిని, ఏకాంతమును సహించి, సమర్పించుకోవడానికి ఒకే ఒక గొప్ప వర్తమానం మనకున్నది; "క్రీస్తు మన పాపములకొరకు మృతినొందెను". "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన



తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". ఇదే సిలువ సందేశం. "వెళ్ళి సువార్తను ప్రకటించుడి". నీ స్వగ్రామంలో చెప్పాల్సిన వర్తమానమిదే.

మనము బోధకులుగా నిలుచుండే ఉన్నత స్థానంలో నిలవడం, మనుష్యుల యిష్టానుసారంగా నడుచుకొని వారిని సంతోషపెట్టడానికి కాదు. లేక మనలను మనము ఇతరులకు చూపించుకోవడానికి కాదు. "వీణ పాటకుడు వీణపై మీ యెదుట గానము చేసినప్పుడు, అతని నేర్పు, ఉచ్చారణ, స్వరమును మెచ్చు కొంటావు. ఉత్తరాన్ని చదువుచున్నప్పుడు, దానిని తెచ్చినవానిని మరచిపోతావు''. సహోదరులారా! మనుష్యులు మనలనుగూర్చి ఏ మనుకొంటున్నారు? వారు "ఎంత మంచి ప్రసంగము చేశారు" అని చెప్పుకొంటున్నారా? లేక "ఎంత గొప్ప క్రీస్తు! ఎంత ఆశ్చర్యకరుడైన రక్షకుడు!" అని చెప్పు కొంటున్నారా?

మనము యేసును తెలియజేస్తున్నామని జ్ఞాపకముంచుకోవాలి. ఆసక్తి గలిగి ఉండాలి. ఎందుకనగా మన వర్తమానం కొందరికి మరణకరమైనది, మరి కొందరికి జీవము నిచ్చేదై ఉంది. మనం చెప్పేది నిజమని మనం నమ్మి బోధించాలి. ఒకప్పుడొక నటుడు నటులకు, పాస్టర్స్‌కు గల బేధాన్ని ఇలా వివరించాడు. "పాస్టర్స్ అయిన మీరు నిజ సంగతులను నిజం కానట్లు మాట్లాడతారు, గాని నటులమైన మేము నిజము కాని వాటిని నిజమైనవిగా మాట్లాడతాము''. నా స్నేహితుడా వినుము: "అందరును పాపము చేశారు, మనుష్యులు నశించుచున్నారు, యేసు క్రీస్తు మాత్రమే వారిని రక్షింపగలడు అని నిశ్చయముగా నమ్మి నీవా వర్తమానమును ప్రకటించడానికి బయలుదేరితే దేవుడు నీకు తోడైయుంటాడు, నీ సేవ మహిమకరమైనదిగా ఉంటుందని నేను నీతో చెప్పుచున్నాను.

అలాగైతే పరిశుద్ధాత్మ ఘనపరచే వర్తమానం నీకు ఉందా? నీవు ప్రసంగించేటప్పుడాయన పాపమును గూర్చి ఒప్పుకొనజేస్తున్నాడా? ఆత్మలు రక్షింపబడి, విశ్వాసులు క్షేమాభివృద్ధి నొందు చున్నారా? నీ వర్తమానము పరిశుద్ధాత్మనుండి కలిగినదైతే నీవెన్నడును సిగ్గుపడనవసరం లేదు, భయపడనవసరం లేదు. ఆయన శక్తిని నమ్మి బయ లుదేరి మాట్లాడు.

## 7. ఫలముల కొరకు నిరీక్షించే విశ్వాసముగల మనుష్యుని

ఒక యౌవన బోధకుడు తన సేవలో ఫలితం కనబడనందున అధైర్యపడి స్పర్జన్ యొద్దకు వచ్చాడు. "నీవు ప్రసంగించినప్పుడెల్ల ఫలితము కనబడాలని నిరీక్షించడం లేదు గదా?" అని స్పర్జన్ ప్రశ్నించెను. అతడు "నిరీక్షించడం లేదు" అని బదులు చెప్పాడు. అంతట స్పర్జన్ "అందువలననే నీ సేవలో ఫలితం కనబడడం లేదు" అని పలికెను. బంతి ఆటలో ఆటగాళ్ళు బంతిని నియమం లేకుండా తన్నరు గాని, వారు దానిని గోలు లోపలకు తన్నడానికి ప్రయత్నిస్తారు. అదే విధముగా మనము కూడా ఒక గురిగలిగియుండాలి. ఆట స్థలములో గురిలేక, తమ ఇష్టము వచ్చినట్లు పరుగెత్తే ఆటగాళ్ళను నేనెన్నడు చూడలేదు. వారొక గురి గలవారై ఆ గురివైపే పరుగెత్తుతారు. మనమును అట్టి పరుగెత్తే పందెములో ఉన్నాము. అది ఆత్మలకొరకైన పందెము.

ఒక వకీలు కోర్టులో వాదించేటప్పుడు ఉల్లాసం కోసం మాట్లాడడు గదా! అతడు తీర్మానం నిమిత్తం వాదించుచున్నాడు. సహోదరుడా! తీర్మానం చేయకపోతే మనము తృప్తిపొందకూడదు. తుపాకి కాల్చేవాడు గురిచూచి తన గురివైపే కాల్చును. అయితే మనకొక గురి యున్నదా? ప్రపంచ యుద్ధసమయములో మనుష్యులను సైన్యములో చేర్చుకోవడానికి మీటింగ్స్ జరిగాయి. అయితే అవి మనుష్యుల ఉల్లాసమునకై జరగలేదు గాని సైన్యములో మనుష్యులను చేర్చుటకై జరిగినవి. ఫలితము లేకపోతే ఆ మీటింగ్స్ జరుపుట వ్యర్థమే. మన రాజుయొక్క సైన్యములో మనుష్యులు చేరవలెనని మనము నిరీక్షించుచున్నామా? మనము నిశ్చయ ఫలితము కొరకైన విశ్వాసము కలిగియుందుము గాక.

## ముగింపు

సహోదరులారా! దేవుడు మనలను వాడు కోవడానికి మనము ఈ ఏడు గుణలక్షణములను కలిగియుందుము గాక! అప్పుడు నిజముగా మన సేవ మహిమకరమైనదై ఉండును.

**– ఆస్వాల్డ్ జె. స్మిత్**

(దేవుడు వాడుకొను మనుష్యుడు పుస్తకం నుండి సంగ్రహణ)



# దేవుడు వాడుకొనే నాయకులు

ఇశ్రాయేలీయులు యోర్దాను నది దాటి, కనానులోనికి ప్రవేశించడాన్ని క్రైస్తవులు ఈ లోకయాత్రను ముగించుకొని పరలోక ప్రవేశానికి సాదృశ్యంగా అనేకమంది పద్యరచయితలు, పాటల రచయితలు అభివర్ణించారు. బాధలలో, కష్టాలలో, వేదనలలో ఉన్న అనేకులు ఈ పాట విని, ఈ పద్యాలు చదివి ఆదరణ పొందడం, పరలోక నిరీక్షణ పట్ల అద్భుతమైన, అర్థవంతమైన అవగాహన ఏర్పరచుకోవడం కూడా జరిగింది. ఈ పాటలు, పద్యాలలోని పోలికలను బైబిల్ పండితులు ఆస్వాదించినప్పటికీ, ఈ పోలికను చాలా అసంబద్ధమైనదిగా, బలహీనమైనదిగా వారు భావిస్తారు. ఒక పాట ఇలా ఉంటుంది – "I don't want to cross Jordan alone" (ఒంటరిగా నేను యోర్దాను దాటడం నాకు ఇష్టం లేదు). మరొకపాట ఇలా ఉంటుంది "On Jordan's Stormy banks I stand/And cast a wishful eye / To Canaan's faith and happy land/where my possessions lie" (భీకరమైన గాలి తుఫానుతోనున్న యోర్దాను ఒడ్డున నేను నిల్చున్నాను/ నిరీక్షణతో నిండిన నేత్రాలతో/ సుందరమైన కనానువైపు చూశాను/ అక్కడ నా స్వాస్థ్యము ఉన్నది".

పరలోకంలో శత్రువులు ఉండరు, యుద్ధాలు అంతకన్నా ఉండవు. అయితే, కనానులో ఉంటాయి! కాబట్టి, ఇశ్రాయేలీయులు యోర్దాను నదిని దాటి, కనానులోనికి ప్రవేశించడం, దేవుని వాగ్దాన ప్రదేశాన్ని స్వాధీనపరచుకోవడం అనేవి క్రైస్తవులు ఈ లోకంలో ఉన్నప్పుడు క్రీస్తులోని వారి ఆత్మీయ స్వాస్థ్యాన్ని స్వాధీనపరచుకొనుటకు, క్రీస్తులోని జయజీవితానికి సాదృశ్యంగా ఉన్నవి. క్రీస్తులోని తమ ఆత్మీయ ధనాన్ని స్వాధీనపరచుకోవడానికి అవసరమైన హెచ్చరికలను ఇస్తూ, హెబ్రీయులకు రాసిన పత్రిక 3,4 అధ్యాయాలు కనాను విజయాన్ని ఉటంకిస్తున్నాయి. మనం ఈ హెచ్చరికలను పాటిస్తూ, జయజీవితాన్ని పొందకపోతే, మోషేకాలంలో యూదులు అరణ్యంలో సంచరించినట్లుగా మనం కూడా సంచరించాల్సి ఉంటుంది.

యెహోషువా గ్రంథం, యెహోషువాను ఆత్మస్థైర్యం కలిగిన సమర్థుడైన నాయకునిగా మనకు అనేకసార్లు చూపిస్తుంది. ఈ గ్రంథం చదివితే దేవుడు ఎలాంటి నాయకులను తన పరిచర్యలో వాడుకుంటాడో తెలియజేస్తుంది.

## 1. పరిచారకులుగా ప్రారంభించే వారిని

యెహోషువ మోషే "పరిచారకుడని" నిర్గమ 24:13లో, 33:11లో ఉన్నది. "హోషేయ" అనేది అతని తల్లిదండ్రులు పెట్టిన పేరు. దాన్ని మోషే యెహోషువాగా మార్చాడు (సంఖ్యా 13:8,16). యెహోషువ అను పేరుకు "ప్రభువు రక్షించును" లేదా "ప్రభువే రక్షణ" అను అర్థం వస్తుంది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి బయలుదేరి వచ్చిన కొన్ని రోజులకే అమాలేకీయులు వారి మీదకు యుద్ధానికి వచ్చారు. మోషే యెహోషువాను ఇశ్రాయేలు సైన్యానికి నాయకునిగా నియమించాడు. యెహోషువా ఆ యుద్ధంలో విజయం సాధించాడు (నిర్గమ 17:8-16). మనం నాయకులము అవ్వాలంటే ముందు పరిచారకులుగా ఉండాలి అనేది లేఖనాలు తెలియజేస్తున్న సూత్రం (సంఖ్యా 11:28;

మత్తయి 25:21,23). చైనా దేశానికి చెందిన క్రైస్తవ నాయకుడైన వాచ్‌మన్ నీ ఇలా వ్రాశాడు: "మనల్ని మనం పరిచారకులంగా లేక సేవకులంగా తగ్గించుకోనంత కాలం, ఆయన్ను ప్రభువుగా హెచ్చించలేము". దావీదు రాజు కాకముందు అతను సేవకునిగా ఉన్నాడు. యేసుక్రీస్తు ఇలా చెప్పాడు: "... నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను" (లూకా 22:27).

## 2. కుటుంబ జీవితంలో కూడా దేవుని చిత్తాన్ని వెదికి, దానికి లోబడే వారిని

ఇశ్రాయేలీయులందరికి వీడ్కోలు చెప్తూ, తాను చేసిన చివరి ప్రసంగంలో యెహోషువా ఇలా అన్నాడు: "నేనును, నా యింటివారును యెహోవాను సేవించెదము (యెహో 24:15). మనం మన కుటుంబాలలో ఆత్మీయ నాయకులంగా లేకపోతే, దేవుని ఇంటిలో నాయకులంగా ఎలా ఉండగలం (1 తిమోతి 3:5)? దురదృష్టవశాత్తు, ఇశ్రాయేలులోని కొన్ని గోత్రాల నాయకులు దేవునికి విధేయత చూపకపోవడం మూలంగా దేవుడు ఆజ్ఞాపించిన విధంగా కేటాయించబడిన ప్రాంతంలో నివసిస్తున్న అన్యులను వెళ్ళగొట్టలేకపోయారు (21:1-3; ద్వితీ 20; న్యాయా 3:1-7). పులిసిన పిండి ముద్దంతటిని పాడుచేసినట్లుగా, అన్యుల పాపాలు దేశమంతటా వ్యాపించి, అవిధేయతకు, అపవిత్రతకు దారితీశాయి (2 కొరింథీ 6:14-18).

## 3. ఇతరులను తనకంటే యోగ్యులుగా ఎంచే వారిని

ఇశ్రాయేలీయుల గోత్రాలకు వారి వారి స్వాస్థ్యాన్ని పంచి ఇచ్చే భాగ్యం యెహోషువాకు లభించింది. అన్ని గోత్రాలకు పంచిన తర్వాత, చివర్లో తాను తన స్వాస్థ్యాన్ని తీసుకొన్నాడు (యెహో 19:49-51). అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీ 2:3ను యెహోషువాను మనస్సులో ఉంచుకొనే వ్రాసి ఉంటాడు: "వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటే యోగ్యుడని యెంచుచు..." కొన్ని అనువాదాలలో "తనకంటే ప్రాముఖ్యమైన వారిగా యెంచవలెను" అని ఉన్నది. ఇతరుల కోసం త్యాగం చేయడం ఎలాగో నిజమైన నాయకులకు తెలుసు.

## 4. తమ తప్పును గుర్తించి, వాటిని ఒప్పుకొని, సరిచేసుకొనే వారిని

హాయి అను పట్టణాన్ని చాలా తేలికగా జయించవచ్చని యెహోషువా భావించాడు. అయితే, అతను దేవుని సన్నిధిని, నడిపింపును వెదకనందున, ఓటమిని చవిచూశాడు. తర్వాత తనను తాను తగ్గించుకొని, ప్రభువు సన్నిధిలో మొఖ్ఖపెట్టినప్పుడు, తన సైన్యంలోనే ఆకాను అనే మోసగాడు ఉన్నట్లుగా దేవుడు యెహోషువాకు తెలియజేశాడు. ఆ మోసగాడు లేక ద్రోహి శిక్ష పొందిన తర్వాత, వారికి విజయం లభించింది (యెహో 7-8). గిబియోనీయులు చెప్పిన అబద్ధాలకు మోసపోయి వారితో ఒప్పందం కుదుర్చుకొన్నాడు. అయితే ఇది దేవుని ధర్మశాస్త్రానికి వ్యతిరేకం (అధ్యా 9). యెహోషువా తన మాటను నిలబెట్టుకొన్నప్పటికీ, గిబియోనీయులను ఇశ్రాయేలీయులకు బానిసలుగా మార్చాడు. విశ్వాసంతోకాక వెలిచూపుతో నడవడం చాలా తేలికే! "ఆధారాలను" చూసి నిర్ధారించుకోకుండా, యెహోషువా దేవుని సన్నిధిలో ప్రార్థించి ఉన్నట్లయితే, "సందర్శకుల" ముసుగులో వచ్చినవారు తమ పొరుగువారు, శత్రువులు అనే విషయాన్ని దేవుడు యెహోషువాకు ప్రత్యక్షం చేసి ఉండేవాడు. మోసపూరితమైన "ఆధారాలను" ఆధారం చేసుకోకుండా దేవునిమీద ఆధారపడి, దేవుని నడిపింపును వెదకడం ఎంతో ఆశీర్వాదకరం.

19వ శతాబ్దానికి చెందిన ఎఫ్.డబ్ల్యు.రాబర్ట్‌సన్ అను బ్రిటీష్ ప్రసంగీకుడు ఇలా చెప్పాడు: యుద్ధంలో లాగే జీవితంలో కూడా అనేక తప్పులు దొర్లుతుంటాయి. ఉత్తమ సైన్యాధికారి లేక ఉత్తమ క్రైస్తవుడు ఎవరంటే... అతి తక్కువ తప్పులు చేసిన వ్యక్తి కాదు... తన తప్పులను సరిదిద్దుకొని అద్భుత విజయాలు సాధించిన వ్యక్తి... తప్పులను మర్చిపోండి. వాటిని విజయాలుగా మార్చుకోండి".

## 5. ఇతరుల నాయకత్వశైలిని అనుకరించకుండా తమ స్వంత శైలిని అభివృద్ధి చేసుకొనే వారిని

అనేక సంవత్సరాల నా పరిచర్యలో గొప్ప సమర్పణ, జయజీవితం కలిగిన విశ్వాసులను మాదిరిగా తీసుకొన్నాను. అయితే, వారి నాయకత్వశైలిని అనుసరించుటకు నేను ఎన్నడూ ప్రయత్నించలేదు. పరిశుద్ధాత్మ దేవుడు, నేను కలసి పనిచేయాలంటే, ఎవరినీ కాపీ చేయకుండా నాకు నేనుగా (నాలోని ఉత్తమ వ్యక్తిని బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తూ) ఉంటూ, ప్రభువుకు మహిమ

**యుద్ధంలో లాగే జీవితంలో కూడా అనేక తప్పులు దొర్లుతుంటాయి. ఉత్తమ సైన్యాధికారి లేక ఉత్తమ క్రైస్తవుడు ఎవరంటే... అతి తక్కువ తప్పులు చేసిన వ్యక్తి కాదు... తన తప్పులను సరిద్దుకొని అద్భుత విజయాలు సాధించిన వ్యక్తి... తప్పులను మర్చిపోండి. వాటిని విజయాలుగా మార్చుకోండి.**

తీసుకువచ్చుటకు కృషి చేయాలి. యెహోషువా మోషే వారసుడైనప్పటికీ, అతను మోషేను ఎన్నడూ అనుకరించలేదు (కాపీ చేయలేదు). మోషే ఇశ్రాయేలీయులకు స్వాతంత్ర్యాన్ని, విడుదలను తీసుకొచ్చిన వ్యక్తి, వారికి శాసనాలను తయారుచేసిన వ్యక్తి. ఒక వ్యవస్థను వారికి ఏర్పాటు చేసిన వ్యక్తి. యెహోషువా ఒక యుద్ధవీరుడు. వివిధ సమయాలలో పరిచర్యలోని వివిధ అవసరాలను తీర్చడానికి వివిధ నాయకులు అవసరం. సెర్చ్ కమిటీలు (నాయకులను అన్వేషించే బృందం) ఈ విషయాన్ని ఖచ్చితంగా మనసులో ఉంచుకోవాలి. మనలోని ప్రతి ఒక్కరు విశిష్టమైనవారే. ప్రభువు పరిచర్యలో విభిన్నరీతులలో, వివిధ విధానాలలో సేవలు అందించేవారము మనం.

## 6. క్రమశిక్షణ కలిగిన వారిని

"యెహోషువా వేకువనే లేచినప్పుడు...." (3:1). మన ప్రభువు కూడా పెందలకడనే లేచి ప్రార్థించాడు (మార్కు 1:35). కఠినమైన దేవుని పరీక్షను, చిత్తాన్ని నెరవేర్చుటకు సైతం అబ్రహాము పెందలకడనే లేచాడు (ఆది 22:3). దావీదు పెందలకడనే నిద్ర మేల్కొనే వ్యక్తి (కీర్తన 5:3). నా క్రైస్తవ జీవితపు తొలిరోజుల్లోనే పెందలకడ లేచి, దేవుని వాక్యం చదివి, ధ్యానించి, ప్రార్థించే అలవాటును నేర్చుకొన్నాను. నేను ఇంట్లో ఉన్నా, హోటల్‌రూమ్‌లో ఉన్నా, లేక ఇతర దేశాలకు వెళ్తూ విమానంలో ఉన్నా సరే ఆ అలవాటును నేను కొనసాగిస్తూనే ఉన్నాను. ఉదయాన్నే దేవున్ని కలుసుకోవడమంటే, ఆ రోజంతా దేవున్ని నీతో కలిగి ఉండడమే. ఉదయాన్నే దేవున్ని కలవకపోతే, ఆ రోజంతటినీ మనమొక్కరమే ఎదుర్కోవాల్సి ఉంటుందన్న మాట. ఇది చాలా ప్రమాదకరం.

## 7. ఇతరులకు వివరించి, ప్రోత్సహించే వారిని

దేవుని ప్రజలు ఏమి చేయాలో వారికి చెబితే సరిపోదు. తాము చేస్తున్న పని ప్రాముఖ్యత, తీవ్రత వారికి అర్థమవ్వాలి. తన ప్రజలను ప్రోత్సహిస్తూ, వారికి అనేక విషయాలను యెహోషువా తెలియజేసినట్లుగా యెహోషువా గ్రంథాన్ని ధ్యానించినప్పుడు నాకు అర్థమైంది. తాను జీవించిన చివరివారంలో ఆయన యెరూషలేముకు వచ్చినప్పుడు, జరుగబోయే విషయాలను యేసు ప్రభువు తన శిష్యులకు తెలియజేశాడు. ఆయన ప్రణాళికలను వారు పూర్తిగా అర్థం చేసుకోలేదు. అయితే, ఆయన దేవుని చిత్తాన్ని నెరవేరుస్తున్నాడన్న సత్యం మాత్రం వారికి అర్థమైంది. కాబట్టి, ఇతరులను ప్రోత్సహించే వ్యక్తిగా ఉంటాడు.

లేఖనాలలోగాని, పాటలలోగాని ఉన్న మిలటరీ భాషను కొంతమంది ఇష్టపడరు. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా, మనం ఒక విషయం తెలుసుకోవాలి. దేవుని ప్రజలకు శత్రువులు ఉంటారు. మనం యుద్ధం చేయాల్సిందే. "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము" (1 తిమోతి 6:12) అని పౌలు తిమోతిని హెచ్చరించాడు. "దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుకొనమని" ఎఫెసీలోని పరిశుద్ధులను పౌలు హెచ్చరించాడు (ఎఫెసీ 6:11). కొన్ని రాజకీయాలు ఈ రోజుల్లో ఎదురౌతున్నాయి. నిజానికి అవి మన ప్రాథమిక స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను భంగపరిచే మతపరమైన అంశాలు. మనం వాటిపై యుద్ధానికి సంసిద్ధులం కాకపోతే, ఓడిపోతాము. మన శత్రువు, అతని సైన్యం మనపై యుద్ధానికి సిద్ధమయ్యారు. మనం నిద్ర మేల్కొనాలి. యుద్ధసన్నద్ధులమై, మెలకువతో, జాగరూకతతో ఉండాలి. యుద్ధ పిలుపుకు ప్రతి క్రైస్తవుడు ప్రతిస్పందించాలి. "దేవుడు ప్రేమాస్వరూపి" (1 యోహాను 4:8) అని యోహాను రాశాడు. యెహోవా యుద్ధశూరుడు అని ఆయనకు పేరు" (నిర్గమ 15:3) అని మోషే రాశాడు.

**– వారెన్ వియర్స్‌బి**

*వీరు అమెరికాలోని ఈస్ట్ చికాగో, ఇండియానాలో 16 మే, 1929లో జన్మించి, 89 సం॥ల వయస్సులో, 2 మే 2019లో అమెరికాలో ప్రభువునందు నిద్రించారు. బైబిల్ టీచర్‌గా, పాస్టర్‌గా, కాన్ఫరెన్స్ స్పీకర్‌గా, ప్రసిద్ధ రచయితగా ప్రపంచవ్యాప్తంగా పేరుగడించారు. వీరు వ్రాసిన 'బి సిరీస్' ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధికెక్కినాయి.*



ప్రత్యేకం

# దేవుని చేతిలో పనిముట్టుగా ఉండాలంటే?

“ధర్మశాస్త్రము వినపడకుండా చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము” (సామెతలు 28:9). ఆ దినములలో దేవుని వాక్యము చదవడానికి అవకాశం ఉండేది కాదు. ఎందుకంటే ప్రింటింగ్ ప్రెస్ అప్పటికి కనిపెట్టలేదు. ప్రజలు తోలు మీద రాసేవారు లేక పాపిరస్ అనే మొక్కల నుండి తయారు చేసిన అట్టల మీద రాసేవారు. మన దేశంలో తాటి ఆకుల మీద రాసినట్టు మనకు గ్రంథాలు కూడా ఉన్నవి. సమాజ మందిరాలలో తోలు చుట్టల మీద రాసిన సంగతులను చదివినప్పుడు ప్రజలు వినేవారు. అందువలన ఈ మాట రాయబడింది. ధర్మశాస్త్రం వినకుండా తమ చెవి తొలగించువాడు ప్రార్థన చేసినను దేవుడు అంగీకరించడు. ఆయన అంగీకరించక పోవడమే కాదు, అట్టి ప్రార్థన ఆయనకు అసహ్యము, హేయము.

మనలో చాలామంది ఎన్నెన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడానికి ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు. మొబైల్ ఫోన్స్ ద్వారా జూమ్ ప్రార్థనలు, మరికొందరు 40 రోజుల ఉపవాస ప్రార్థనలు, మరికొందరు సంఘ ప్రార్థనలు, మరి కొందరు కుటుంబ ప్రార్థనలు జరిగించడంలో పట్టుదల కలిగి ఉన్నారు. అయితే వారి జీవితాల్లో తోటి మానవుని పట్ల ప్రేమ ఏ మాత్రము కనపడదు. పరిశుద్ధత ఏమాత్రమును చూడలేము. అబద్ధాలు చెప్పడానికి ఏమాత్రమును వెనకాడరు. మంచినీళ్ళు తాగినట్లుగా అబద్ధాలు చెబుతారు. అందుకనే మీకా గ్రంథంలో దేవుడు మాట్లాడుతూ.. ‘ఓ మనుష్యుడా ఏది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని ఎదుట ప్రవర్తించుటయు, ఇంతే కదా యెహోవా నిన్ను అడుగుచున్నాడు (మీకా 6:8). అయితే మనుష్యులు న్యాయంగా నడుచుకొనుట పూర్తిగా మానేసి “ఏమి తీసుకొని వచ్చి నేను యెహోవాను దర్శింతును? ఏమి తీసుకుని వచ్చి మహోన్నతుడైన దేవుని సన్నిధిని నమస్కారం చేతును? దహన బలులను, ఏడాది దూడలను అర్పించి దర్శింతునా? వేలాది పొట్టేళ్ళను, వేలాది నదులంత విస్తారమైన తైలమును ఆయనకు సంతోషం కలుగజేయునా? నా అతిక్రమమునకై నా జ్యేష్ఠ పుత్రుని నేను ఇత్తునా? నా పాప పరిహారమునకై నా గర్భఫలమును నేను ఇత్తునా? (మీకా 6:6,7) అంటూ మాట్లాడుచున్నారు.

ఇశ్రాయేలీయుల అధిపతుల గురించి దేవుడు ఇలా మాట్లాడుచున్నాడు. ఇశ్రాయేలీయుల అధిపతులారా, న్యాయమును తృణీకరించుచు, దుర్నీతిని నీతిగా ఎంచువారలారా, ఈ మాట ఆలకించుడి. నరహత్య చేయుట ద్వారా సీయోనును మీరు కట్టుదురు, దుష్టత్వము జరిగించుట చేత యెరూషలేమును మీరు కట్టుదురు.... అయినను... యెహోవా మన మధ్య ఉన్నాడు కదా! మనకు కీడు రానేరదు అని అనుకొందురు. కాబట్టి చేను దున్నబడునట్లు మిమ్మును బట్టి సీయోను దున్నబడును, యెరూషలేము రాళ్ళ కుప్పలగును... (మీకా 3:9-12).

మనము ఆరాధించు దేవుడు... పరిశుద్ధుడు, నీతిమంతుడు, న్యాయవంతుడు, మంచివాడు. దేవునిని ఆరాధించేవారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను అని ప్రభువు చెప్పుచున్నాడు (యోహాను 4:24). న్యాయమును అనుసరించువారు ఎల్లవేళలా నీతిని అనుసరించి నడుచుకొనువారు ధన్యులు (కీర్తనలు 106:3).

## అబద్ధాలు ఆడకూడదు

మన సభ్యులు ఎంతోమంది ఉన్నారు. కొన్ని కొన్ని పట్టణాలలో 40 లేక 50 మంది వరకు ఉన్నారు. అయితే వీరిలో కొంతమంది అబద్ధాలు మాట్లాడేవారు. తమ కుటుంబములో, భార్యతోనూ, పిల్లలతోనూ, తల్లిదండ్రులతోనూ, అన్నదమ్ములతోనూ, అక్కచెల్లెం డ్రతోనూ అబద్ధములాడుచున్నారు. అబద్ధములాడు పెదవులు యెహోవాకు హేయములు, కల్లలాడు నాలుక యెహోవాకు అసహ్యములు (సామెతలు 6:17). మీరు అబద్దమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాట్లాడవలెను (ఎఫెసీ 4:25). ఇతరుల గురించి అబద్ధాలు ప్రచారం చేయకూడదు. ఎందుకనగా పొరుగువాని మీద అబద్ధ సాక్ష్యం పలుకకూడదు అని ప్రభువు చెప్పారు (ద్వితీయో 5:20).

## పరిశుద్ధంగా జీవించాలి

మన ఇయు, ఇజియఫ్ సభ్యులు దేవుని చేతిలో సాధనంగా ఉండాలంటే పరిశుద్ధ జీవితాన్ని అల వాటు చేసుకోవాలి. మనము చెప్పే అబద్ధాల విషయంలో దేవుని సన్నిధిలో ఒప్పుకోవాలి. దేవుడు తన కుమారుడిని మన కొరకు అనుగ్రహించాడు, ఆయన తన ప్రజలను వారి పాపము నుండి రక్షించేవాడు (మత్తయి 1:21). అనగా ఆయన మనలను మన పాప జీవితం నుండి విడిపించి పరి శుద్ధపరచి నీతి మార్గంలో నడిపించేవాడు. దేవుని సన్నిధిలోకి వెళ్ళి మనలో ఉన్న ప్రతి అబద్ధమును, కోపమును, ద్వేషమును, పగను, ప్రతి విధమైన దుర్మార్గమును, దుష్టత్వమును, ఒప్పుకొందాం. అప్పుడు ప్రభువు మనలను దుర్నీతి నుండి కడిగి పవిత్ర పరుస్తాడు (1 యోహాను 1:9), అనగా మనకు ఆయన తన పరిశుద్ధతను అనుగ్రహించి, మనలను నీతి మార్గంలో నడిపిస్తాడు.

## జారత్వానికి దూరంగా ఉండాలి

మనలోని చాలామంది విశ్వాస విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ పరస్త్రీలను మోహపు చూపులు చూడడం మానకుండా ఉంటున్నారు. ప్రతి ప్రేమ వ్యవహారం సాధారణంగా మోహపు చూపుతో మొదలై, మోహపు చూపులతో కొనసాగుతుంది. మోహపు చూపు చూచుట హృదయమందు వ్యభిచారం చేయుట అని ప్రభువు చెప్పారు (మత్తయి 5:28). మన మొబైల్స్, ల్యాప్‌టాప్స్‌లో అసభ్యకరమైన దృశ్యాలను



చూడడం మానట్లేదు. పర స్త్రీ యొక్క చక్కదనమును నీ హృదయంలో ఆశింపకుము (సామెతలు 6:25) అని దేవుని వాక్యము చెబుతుంది. అంతేకాదు పర స్త్రీ యొక్క దిగంబరత్వాన్ని చూడకూడదని దేవుడు మాట్లాడుతున్నాడు. ఈ అపవిత్రతను విశ్వాసులు తమ హృదయాల్లో పోషించుచున్నప్పుడు పరి శుద్ధుడైన దేవుడు తన సువార్తను ప్రకటించడానికి, దేవుని రాజ్యమును నిర్మించడానికి ఇలాంటి వారిని తన పాత్రగా చేసుకోలేడు.

## త్వరగా ధనవంతులవ్వాలనే దురాశ ఉండ కూడదు

కొంతమందికి విస్తారమైన దురాశ. ఇతరుల ను చూచి తాము కూడా కార్లు, ఇండ్లు కలిగి ఉండాలని ఆరాటపడుచున్నారు. కార్లు, ఇళ్ళు కలిగి ఉండకూడదని ప్రభువు చెప్పట్లేదు. గాని వాటి విషయమై దురాశ కలిగి ఉండొద్దని ప్రభువు చెబుతున్నాడు. దానియేలు అపవిత్రంగా ఉండకూడదని నిర్ణయించుకొని పరిశుద్ధంగా జీవించాడు. దేవుడు ఆయనను రాజు తర్వాత అధికారం గల వానిగా బబులోను సామ్రాజ్యంలోనూ, మాదీయ, పారసీక రాజ్యంలోనూ చేశాడు. మనం కూడా నీతి, న్యాయం కలిగి కష్టపడి జీవించినప్పుడు ప్రభువు మనల్ని కూడా తగిన సమయమందు హెచ్చిస్తాడు.

## వాక్యముతో హృదయమును, మనస్సును నింపుకోవాలి

చాలామంది ఉదయం పది లేక ఇరవై



నిమిషాలు మౌన ధ్యాన సమయంలో బైబిల్ చదువుతున్నారే గాని దేవుని వాక్యమును అనేకసార్లు చదువుకుంటూ, ధ్యానిస్తూ, తమ మనసులను, హృదయాలను దేవుని వాక్యంతో నింపుకొనుట లేదు. అప్పుడప్పుడు, అవసరం వచ్చినప్పుడు, బోధించాల్సి వచ్చినప్పుడు బైబిల్ చదివి, ధ్యానించే సంస్కృతికి అలవాటుపడిపోయాం. ఇటువంటివారు పరిచర్యలో పాల్గొన్నా ఎలాంటి ఫలితం ఉండదు. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పాలి. అపొస్తలుడైన పౌలు కొల స్సీయులకు రాస్తూ " క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" అని అంటాడు (కొలస్సీ 3:16). గనుక దేవుని వాక్యాన్ని విలువైనదిగా యెంచి విలు వైన సమయాన్ని గడుపుదాం.

## వాక్యానికి విధేయులై జీవించాలి

అంతేకాకుండా దేవుని వాక్యమునకు విధేయులై జీవించడానికి ఎంత మాత్రం ఆసక్తి కలిగి లేరు. దేవుని వాక్యమునకు లోబడి జీవించడం విశ్వాసులలో కనిపించడం లేదు. దేవుని వాక్యాన్ని చదువుతున్నప్పుడు దేవుడు మనతో అనేకసార్లు మాట్లాడతాడు. ఎందుకంటే, బైబిల్ దేవుని వాక్కు. మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన ఎడల మీ పరలోకపు తండ్రియు మీ అపరాధముల ను క్షమించును. మీరు మనుష్యుల అపరాధముల ను క్షమింపకపోయిన ఎడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు (మత్తయి 6: 14,15). ఈ వాక్యం చదివినప్పుడు మన స్పందన ఎలా ఉంది? నేను కూడా నాకు విరోధంగా కీడు చేసిన వారిని క్షమించాలి కదా అని అనుకుంటూ క్షమించడానికి ప్రయత్నం చేస్తే క్షమించలేమని మనకు తెలుస్తుంది. అప్పుడు ప్రభువు వద్దకు వెళ్ళి, ప్రభువు మీద ఆధారపడతాము. అప్పుడు ప్రభువు మనకు క్షమించే హృదయాన్ని ఇస్తాడు. అప్పుడు మాత్రమే మనం క్షమించగలుగుతాము. మన జీవితంలో పాపక్షమాపణ ప్రభువు వలన మాత్రమే పొందాము. ఆయన కృప వలననే రక్షణ పొందాము. రక్షణ మనము సంపాదించుకోలేదు. అలానే నిత్య జీవితంలో దేవుని వాక్యానికి లోబడడం కూడా ప్రభువు వలన మాత్రమే నేర్చుకొంటాము.

## ఆత్మపూర్ణులుగా ఉండాలి

దేవుని సేవ కొరకు దేవుని చేతిలో పనిముట్టుగా ఉండాలంటే చాలా ముఖ్యమైనది ఆత్మ పూర్ణులై ఉండాలి (ఎఫెసీ 5:18) ఆత్మపూర్ణులై ఉండడం అంటే మన జీవితంలోని అన్ని విషయాల్లో, అన్ని పరి స్థితుల్లో ఆయన అధికారానికి ఒప్పుకోవడం. దేవుని ఆత్మ మన జీవితం యావత్తును పరిపాలన చేయాలి. దేవుని ఆత్మకు మన జీవితంలోని అన్ని రంగాల్లో పరిపూర్ణ అధికారం ఉండాలి. మన ఆలోచనలు, తీర్మానాలు, కోరికలు, ఊహలు అన్నీ పరిశుద్ధాత్మ యొక్క అధికారం కింద జరగాలి. ఆయన మనల్ని పరిపాలించాలి, ఆయన మనల్ని బలపరచాలి. అప్పుడు మన జీవితం ఎంతో బలంగా ఉంటుంది. మనము పరిశుద్ధాత్ముని దు:ఖపరచకూడదు (ఎఫెసీ 4:30). మన హృదయములో ఉన్న సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ సకల విధమైన దుష్టత్వం విసర్జించాలి (ఎఫెసీ 4:31). విసర్జించకపోతే పరిశుద్ధాత్మను దు:ఖపెట్టిన వారం అవుతాము. ఈ చెడ్డ గుణాలు మనలో కనబడితే వెంటనే ప్రభువు దగ్గర ఒప్పుకోవాలి. అప్పుడు దేవుని కృపను బట్టి విసర్జించడం జరుగుతుంది. అప్పుడు దేవుడు మనలను పరిశుద్ధాత్మతో నింపుతాడు అనగా పరిశుద్ధాత్మతో బలపరుస్తాడు.

పరిశుద్ధాత్మతో బలపరిచినప్పుడు నిజం పలక డానికి బలం పొందుతాము. కోపము, ద్వేషము, పగ విసర్జిస్తాము. అపవిత్రతకు (జారత్వానికి) దూరంగా ఉండడానికి సమర్థతను పొందుతాం. కంటి చూపులతో పాపం చేయము, చేయలేము. ధనవంతులగుటకు మనలో ఉన్న ఆరాటం నుండి విడుదల పొందుతాము. దేవుని వాక్యమును చదవడానికి, ధ్యానించడానికి ఆసక్తి కలిగి ఉంటాము. దేవుని వాక్యానికి విధేయులవ్వడానికి బలపరచబడతాం.

**– డా. పిట్టా సిరాజ్,** ఇవాంజిలిస్ట్, విజయవాడ



ప్రత్యేకం

## సహవాసంలో అందరూ

# దేవునిచే వాడబడే పాత్రలా ఉండాలి

సురేష్ ఉద్యోగరీత్యా వేరొక ప్రాంతానికి బదిలీ అయ్యి అక్కడి పరిచర్యలో కుటుంబంగా పాల్గొంటున్నారు. అప్పుడే ఇజియఫ్‌కు వెళ్ళి వచ్చిన సురేష్, లతలు జరిగిన బైబిల్ స్టడీ గురించి మాట్లాడుకొంటూ, ఇటీవల తాను ఇజియఫ్‌లో ఎదుర్కొన్న అనుభవం తనను బాధించిందని, 'మన ఇజియఫ్‌ను బట్టి దేవుడు సంతోషిస్తున్నాడా?' అని సురేష్‌ను అడిగింది. ఏమి జరిగిందో చెప్పు అన్నాడు సురేష్. ఇజియఫ్‌లో దేవుడు నాతో మాట్లాడిన మాటలను బట్టి సంతోషిస్తున్నాను, సరిచేయబడ్డాను. వాక్యపరంగా మంచిగానే ఉంది గానీ, సహవాసంగా ఒకరికొకరు ముభావంగా, పలకరిస్తేనే పలకడం, మొక్కుబడిగా నవ్వడం నాకు చాలా బాధగా ఉంది. ఇక్కడ అందరూ దేవుని పరిచర్యలో, కమిటీలో కూడా ఉన్నారు. దేవుడు ఎవరిని పరిచర్యలో వాడుకుంటాడు? అని భర్తను అడిగింది.

అందుకు సురేష్ చిన్నగా నవ్వుతూ, నేను నిన్ను, నీ ఇబ్బందిని గమనించాను. పరిచర్యలో వ్యక్తులు వివిధ రకాలుగా ఉంటారు. మన స్వభావాలు, నేపథ్యం, ఆలోచనా విధానం వేరు. అలాగే ప్రతి ఒక్కరూ ఉంటారు. కానీ క్రీస్తులో ఐక్యత కలిగి ఉన్నప్పుడు ఒక్క కుటుంబంగా ఉంటాము. సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము! (కీర్తనలు 133:1). భేదాభిప్రాయాలు ఉన్నప్పుడు వాటిని సరిచేసుకునే ప్రయత్నం చేసినప్పుడు దేవుడు తప్పక ఆయన పరిచర్యలో వాడుకుంటాడు. అది అంత సులువు కాదు, కానీ ప్రభువులో మన ప్రయత్నం ఉండాలి.

చూడు లత! నువ్వు ఇతరుల యెడల ప్రేమతో ఉన్నావా? లేదా? రోమా 12:9లో మీ ప్రేమ నిష్కపటమైనదై ఉండవలెను అని పౌలు గారు హెచ్చరిస్తున్నారు. పరిశుద్ధాత్మ ద్వారా ప్రేమ మన హృదయంలో కుమ్మరింపబడింది (రోమా 5:5). ఈ వాక్యం నాకు చాలా ఇష్టమైనది. ఆయనే మొదట మనలను ప్రేమించాడని జ్ఞాపకం చేసుకున్నప్పుడు ఖచ్చితంగా తోటి విశ్వాసులను ప్రేమించగలం. విద్యార్థులను, గ్రాడ్యుయేట్స్‌ను ప్రేమించగలిగే మనస్సు ఉంటే తప్పక దేవుడు నిన్ను తన పనిలో వాడుకుంటాడు.

పరిచర్యలో చాలా బిజీగా ఉన్నామని ప్రార్థించడం లోపిస్తే ఖచ్చితంగా సాతానుడు సహవాసంలో, పరిచర్యలో చిచ్చు పెడతాడు. అపార్థాలు, బేధాభిప్రాయాలు వస్తాయి. పరిచర్య కొరకు ప్రార్థించే భారం కలిగి ఉంటే తప్పక దేవుడు నిన్ను తన పనిలో వాడుకుంటాడు. యాకోబు 5:16లో ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి అని, యెడతెగక ప్రార్థన చేయుడి (1 థెస్స 5:15), మీలో యెవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను (యాకోబు 5:13), ప్రార్థన ద్వారా దేవుడు భారం కలిగించి, నీకు పరిచర్య ద్వారాలను తెరుస్తూ,

అడ్డంకులను తీసివేస్తాడు. నెహెమ్యాను జ్ఞాపకం చేసుకుంటే తన స్వదేశం కొరకు స్వజాతీయుల క్షేమం కొరకు ప్రార్థించాడు, దేవుడు తనను వాడుకున్నాడు.

సామెతలు 3:6లో నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. మన ప్రవర్తన ఆయన అధికారానికి లోబడి ఉంటే, మనం ఆయన సాధనంగా వాడబడతాం. యోసేపును జ్ఞాపకం చేసుకుంటే ఆది 39:8,9లో తన ప్రవర్తనను దేవుని అధికారానికి అప్పగించాడు గనుక ఒక అన్యదేశంలో దేవునికి మహిమకరంగా జీవించగలిగాడు. మన ప్రవర్తన (బిహేవియర్) దేవుని యెదుట సరైనదిగా ఉంటే ఆయన పాత్రగా మనల్ని వాడుకుంటాడు.

పారదర్శకత ప్రస్తుత పరిచర్యలో లోపించిందని అనిపిస్తుంది. చాలామంది ఇగోతో ఉన్నట్లు గమనిస్తున్నాం. విషయాల్లో లోపాల్ని వెదుకుతూ, కొంతమంది ఇన్ఫీరియారిటీతో తోటి విశ్వాసులతో ఓపెన్‌గా ఉండలేకపోతున్నారు. ఇలా ఉంటూ దేవుడు నన్ను పరిచర్యకు పిలిచాడని, దేవుడు నన్ను వాడుకొంటున్నాడని ఎలా చెప్పగలం?

మీరు ప్రియులైన పిల్లల వలె దేవుని పోలి నడుచుకొనుడి అని ఎఫెసీ 5:1లో మనం చదువుతాం. ఎటువంటి తేడాలు లేకుండా అందరినీ ప్రేమించిన మన క్రీస్తు మనకు మాదిరి. ఎటువంటి తేడాలు లేకుండా అందరినీ క్షమించిన (యూదా ఇస్కరియోతు) మన క్రీస్తు మనకు మాదిరి. ఎప్పుడైతే మనం ఆయన పని కొరకు ఆయనను మాదిరిగా కలిగి ఉంటామో, తప్పక ఆయన మనల ను వాడుకుంటాడు.

నువ్వు ఏదైతే ఎదుర్కొంటున్నావో ఆ విషయాలను బట్టి వాటిలో మార్పు రావాలని ప్రేమతో వారి కొరకు ప్రార్థన చేస్తూ, మంచి ప్రవర్తన కలిగి, దేవుని ఎదుట నమ్మకంగా ఉంటే ఆయన చేతిలో వాడబడే వారిగా మనం తప్పక ఉంటాం. మనం ఉన్న స్థలంలో దేవుని మహిమార్థం జీవిస్తాం.

ఇక ఏమీ ఆలోచించక ప్రార్థన చేసుకుని పడుకుందాం రా అని భర్త చెప్పడంతో కొంత భారం తగ్గినట్లు అయ్యింది.

– ఓ గ్రాడ్యుయేట్

బైబిల్ స్టడీ

# విభిన్నంగా జీవించు

## (1 పేతురు 1:13–2:3)

### నేపథ్యం

క్రీస్తును వెంబడించినందున అత్యధిక శ్రమలు, హింసలు పొందే విశ్వాసులను ప్రోత్సహిస్తూ, ఆదరిస్తూ, హెచ్చరిస్తూ, ధైర్యంగా జీవించాలని పేతురు రాసిన భాగమిది. ఎటువంటి సంక్షోభంలో ఉన్నప్పటికీ రాజీపడకుండా పరిశుద్ధత, నైతిక ప్రవర్తన కలిగి విభిన్నంగా జీవించాలనే పురిగొల్పు ఇది.

### ప్రశ్నలు

1. నీ కళాశాల, ఉద్యోగ ప్రాంతం, జీవించే ప్రదేశాలలో అందరూ నిన్నెలా గుర్తిస్తారు?
2. ఎటువంటి విభిన్న జీవితం కలిగి ఉండాలని పేతురు హెచ్చరిస్తున్నాడు? (14వ). అటువంటి జీవితం కోసం మనం పాటించవలసిన ఆజ్ఞలేవి? (13–16 వ).
3. ఈ ఆజ్ఞలకు పేతురు ఇచ్చే కారణాలు ఏవి (17–21 వ)?
4. అనుదిన జీవితంలో ఒక విశ్వాసి పరిశుద్ధ జీవితాన్ని ఏయే విషయాలలో చూపగలడు (1 తిమోతి 4:11,12)?
5. పరిశుద్ధంగా జీవించడానికి నీవు ఎదుర్కొనే సవాళ్ళు ఏంటి? వాటిని ఎలా అధిగమించ గలవు?
6. మన విమోచనకు ఆధారం ఏమిటి. మనం విమోచించబడిన వారమని ఇతరులు ఎలా గుర్తించగలరు? (18–23వ).
7. పేతురు నవోదు చేసిన పాపాలు, ఇతరులతో మన సంబంధబాంధవ్యాలను ఎలా చెడగొడతాయి? (2:1). దానికి పరి ష్కారమేంటి? 1:22–24, 2:3).
8. ఆధ్యాత్మిక ఎదుగులను పోషించవలసిన అవసరతను పేతురు ఎలా వర్ణించాడు?
9. 'వాక్యమనే పాలను అపేక్షించడం' కోసం నీవు ఎదుర్కొనే అవరోధాలను ఎలా అధిగ మిస్తావు?

– విజే డెస్క్

# పనికిరాని తీగెలు

## (దేవుడెందుకు వాడుకోడు?)

డియర్ శ్యామ్!

నిన్ననే నీ మెయిల్ అందింది. చాలా సంతోషం. దేవుని పరిచర్య పట్ల నీకున్న ఆసక్తిని బట్టి దేవుని స్తుతిస్తున్నాను.

“కొంతమందిని దేవుడెందుకు వాడుకోడు?” నీవు వేసిన ఈ ప్రశ్న చాలా మంచి ప్రశ్న. దీని గురించి చాలానే ఆలోచించాను. మొదట నాకెదురైన అనుభవాలతో ప్రారంభిస్తాను.

దాదాపు 20 ఏళ్ళ క్రితం నేను ఓ ప్రసంగం విని ‘దేవా, నన్ను వాడుకో’ అని ప్రార్థించడం మొదలుపెట్టాను. ఆ ప్రసంగం యెషయా 6:8 మీద జరిగింది. నేననుకున్నాను, దేవుడు నన్ను వాడుకొంటాడు. ఇక అనేకమందిని క్రీస్తు వద్దకు నడిపిస్తాను అనుకున్నాను.

ఆ తర్వాత దేవుడు కొత్త పాఠాలు నేర్పడం ప్రారంభించాడు. దేవుడు వాడుకోవాలంటే నేనెలా ఉండాలి? ఎలా ఉంటే వాడుకోడో అర్థమైంది.

దేవుడు సార్వభౌమాధికారి. ఆయన సార్వభౌమత్వం గురించి మనకుండే సాధారణమైన అపోహ ఏంటంటే ‘దేవుడెవరినైనా వాడుకొంటాడు’ అని.

అలా అనుకొంటూ పరిచర్య ప్రారంభించి, సరైన దైవిక జ్ఞానం లేక, ఆయనతో గడిపే తీరిక లేక, దేనికో దానికి దాసులై సూడో క్రైస్తవులుగా, సున్నం కొట్టిన సమాధుల్లా, జీవచ్ఛవాల్లా బతుకుతున్న వారు కోకొల్లలు.

కనిపించిందల్లా నమ్మేసి కొందరిని దేవుడెంత గొప్పగా వాడుకొంటున్నాడో! అని అనుకోవద్దు.

అందుకే, దేవుడెవరిని వాడుకోడో మనం ముందు అర్థం చేసుకొంటే, ఎవరిని వాడుకొంటాడో ఈజీగా అర్థమైపోతుంది.

### 1. అబద్ధ బోధకులు

వీరు దేవునికి, ఆయన వాక్యానికి విధేయత చూపని వారు. వీరి సొంతజ్ఞానంతో దేవుని వాక్యానికి విపరీత అర్థాలు, సొంతపైత్యాలు కలిపి బోధించడం ప్రారంభిస్తారు. దురద చెవులు గల వాళ్ళు కొందరు వీరి చుట్టూ చేరి భజనలు చేస్తుంటారు. ఈ భజన బృందాలకు కొత్తపేరు ‘ఫాలోయర్స్’. వీళ్ళు విశ్వాసులు కాదు. దేవుడు వీరిని వాడుకోడు కాబట్టి వీరి పరిచర్య ద్వారా విశ్వాసులు ఏర్పడరు. పరిశుద్ధాత్ముడు వీరి ద్వారా పనిచేయడు. కావున ‘ఆత్మ’ జరిగించు కార్యములు వీరి పరిచర్య ద్వారా అసంభవం. పౌలు కొలస్సీయులకు రాస్తూ 2:4లో “ఎవడైనను చక్కని మాటల ద్వారా మిమ్మును మోసగించకుండునట్లు ఈ సంగతి చెప్పుచున్నాను” అంటూ 2:8లో “....మోసకరమైన నిరర్థక తత్వజ్ఞానము చేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి” అని వీరి గురించి తేటగా చెప్పాడు.

## 2. విమర్శనా విలుకాండ్రు

ఈ దినాల్లో దేవుని కొరకు త్యాగాలు చేసి నాగలి చేతపట్టి మిషన్ పొలాన్ని దున్నుకొంటూ కష్టపడి పనిచేసేవారు అనేకులున్నారు. అయితే వీరిని టార్గెట్ చేస్తూ విమర్శించడమే పనిగా, అందుకోసమే దేవుడు తమను పిలిచాడన్నట్టు ప్రవర్తిస్తూ విమర్శనాస్త్రాలు ఎక్కుబెడుతూ పనిచేసేవారిని గాయపరుస్తూ ఉంటారు. వీళ్ళు ఇతరులతో మాట్లాడినా, ప్రసంగాలు చేసినా విమర్శలే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తారు. యేసు శిష్యుడైన యోహాను కూడా దియొత్రేఫే గురించి చెప్తూ 3 యోహాను 1:10లో వారు కట్టడానికి బదులు, సంఘాన్ని ఎలా పాడు చేస్తారో చెప్పాడు.

## 3. క్రైస్తవ పాపులు

క్రైస్తవుల్లో కొందరు పాపాన్ని తేలికగా తీసుకొని దాన్ని విడిచిపెట్టలేక పాపంలో కొనసాగుతూ ఉంటారు. వీరు వాతవేబయడిన మనస్సాక్షి గల వారు. పౌలు తిమోతికి రాస్తూ రెండవ పత్రిక 2:21లో "ఎవడైనను వీటిలో చేరక తన్ను తాను పవిత్రపరచుకొనిన ఎడల....యజమానుడు వాడుకొనుటకు అర్హమైన ....".

వీరుకూడా దేవుడు వాడుకోవడానికి నిరుపయోగులుగా ఉంటారు. 2 తిమోతి 4:10లో పౌలు చెప్పిన 'దేమా' మంచి ఉదాహరణ.

## 4. సిగ్గుతో కూడిన పిరికితనం వలన వచ్చిన సోమరితనం

పౌలు తిమోతిని ఎఫెసుకు పంపుతూ "దేవుడు మనకు పిరికి తనము గల ఆత్మను ఇయ్యలేదు" అని చెప్పి పంపాడు. పిరికితనం సిగ్గుతో కూడినదై సోమరులను తయారు చేస్తుంది. వీరు నిష్ఫలులు అని బైబిల్ చెబుతుంది. సువార్తను అంటిపెట్టుకొని శ్రమానుభవం ఉంటుంది. సువార్తను ప్రకటించడానికి ధైర్యము కావాలి. ఈ దినాల్లో సంఘాల్లో ఎక్కువ సేపు కూర్చోలేకపోతున్నారు. ఎక్కువ సేపు వాక్యాన్ని వినలేకపోతున్నారు. షార్ట్ మెసేజెస్, షార్ట్ ప్రేయర్స్, షార్ట్‌టైమ్‌లో ముగించడం ఇష్టపడుతున్నారు. ఇలాంటి మరగుజ్జు క్రైస్తవులను దేవుడేమి చేసుకొంటాడు!

## 5. గర్వాంధులు

వీళ్ళు ఎవరు చెప్పేదీ వినరు. చివరికి దేవుడు



చెప్పేది కూడా వినరు. తాము చెప్పేదే అందరూ వినాలని అనుకొంటారు. విధేయత అనేది వీరి డిక్షనరీలో ఉండదు. తమకే అన్నీ తెలుసు, ఇతరుల ముందు తమ మాటే నెగ్గాలని చూస్తుంటారు. గర్వం గురించి, గర్విష్టుల గురించి రాజైన సొలొమోను తాను రాసిన పుస్తకాల్లో ఎన్నో విషయాలు తేటతెల్లం చేశాడు. గర్వము, అహంకారము, దుర్మార్గత, కుటిలమైన మాటలు నాకు అసహ్యములు అని సామెతలు 8:13లో చెప్పాడు. 16:18లో నాశనమునకు ముందు గర్వము నడచును, పడిపోవుటకు ముందు అహంకారమైన మనసు నడచును అని రాశాడు. వీరు తమ జీవిత ప్రయాణంలో తామే డ్రైవర్‌గా ఉంటారు. దేవుని నడిపింపును పట్టించుకోరు. యాకోబు 4:6లో సొలొమోను రాజు చెప్పిన మాటలను ఉదహరిస్తూ దేవుడు వీరిని ఎదుర్కొంటాడు అంటే ఆపేస్తాడు అని రాశాడు. యిర్మీయా 9:23లో 'గర్వించవద్దు' అని దేవుడే చెప్పాడు. గర్వం ఆధ్యాత్మిక అంధత్వాన్ని కలుగజేస్తుంది. వీరు దేవుని మాట వినరు గనుక దేవుడు వీరిని వాడుకోలేదు. వీరిలో రక్షణానందం కరువవుతుంది.

దేవుని సార్వభౌమ చిత్తంలో దేవుని పాత్రతో పాటు, మన పాత్ర కూడా ఉంటుంది. అందుకే బైబిల్ 'ఆయనకు అర్హమైన పాత్రగా ఉండమని' ప్రభోధిస్తుంది.

పై విషయాలను చదివి అర్థం చేసుకొంటావని అనుకొంటున్నాను. ఇంకేమైనా ప్రశ్నలు ఉంటే మెయిల్ చేయి. ఉంటాను.

**– జేసన్ బత్తుల,** చీరాల



# త్యాగపూరిత సేవ

"మలినమైన నా శరీరం కోసం దేవుడు మలినము లేని తన శరీరాన్ని మరణానికి అప్పగించేంతగా త్యాగం చేస్తే మలినమైయున్న నా శరీరాన్ని మహిమ గల ఆ దేవుని సేవలో మరణమగునంతగా అప్పగించుకున్నా అది కూడా తక్కువే."

*– దేవునికో పువ్వు అనే నవల నుండి సేకరణ*

## సేవ

ఇది ఒక మహా భావగర్భితమైన రెండు అక్షరాల పదం. సేవ అనేది కొనసాగుతున్న కార్యం. ఇది ఎవరో చెబితే చేసేది కాదు. అలా చేస్తే అది సేవ అని అనిపించుకోదు. అది ఖచ్చితంగా మనసులో పుట్టాలి. ఇష్టం ఉన్నా లేకున్నా హృదయపూర్వకంగా సేవ చేయాలి. ప్రతిఫలాపేక్ష లేకుండా చేయాలి. ఇలాంటి సేవ చేయడం వలన తనకు కష్టం, నష్టం వచ్చినా మనస్సులో వ్యతిరేకత లేకుండా ప్రేమతో అంకిత భావంతో చేయాలి. ఎవరికైతే సేవ చేస్తున్నామో వారి పట్ల ప్రేమ, శ్రద్ధ, అంకితభావం కలిగి ఉండాలి. వారు పెద్దవారైనా లేక చిన్నవారైనా వారి పట్ల గౌరవం ఉండాలి. చేసే పని పట్ల నిబద్ధత ఉండాలి. లోకరీత్యా చూస్తే "కస్టమర్ సర్వీస్" అన్న పదం వింటూ ఉంటాం. అది కూడా ఒక రకమైన సేవే అని ప్రజలు అంటారు. నిజానికి అన్ని రకాల కస్టమర్ సేవలు ప్రతిఫలాపేక్షను కలిగి ఉంటాయి. అయినప్పటికీ దాన్ని కూడా సేవ అంటారు. అలా ప్రతిఫలాన్ని ఆశించి సేవ చేసేవారు సైతం సేవలు పొందే వారిని "కస్టమర్ దేవుళ్ళు" అని అంటారు. తమకంటే చిన్నవారైనా, పెద్దవారైనా, ధనికులైనా, పేదలైనా సమాజంలో మంచి పేరు ఉన్నా, చెడ్డ పేరు ఉన్నా తమ కస్టమర్లను మాత్రం తమకంటే గొప్పగా భావిస్తారు. అందుకే వారితో మాట్లాడేటప్పుడు మర్యాదగా, గౌరవప్రదంగా 'సర్, మేడం' అని సంబోధిస్తారు. వారి పట్ల శ్రద్ధ చూపిస్తూ, వారికి సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు.

## ఆధ్యాత్మిక సేవ

ప్రస్తుత లోకంలో రకరకాల ఆధ్యాత్మిక సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇది మనిషిలోని ఆత్మకు ప్రాధాన్యమిచ్చి ఆ ఆత్మకు సంబంధించిన విషయాలలో సహాయ, సహకార, ప్రోత్సాహాలను ఇస్తూ సేవ చేస్తూ ఉంటారు. ఇలాంటి సేవ చేసేవారిలో ఎక్కువమంది సత్యం తెలియక తమకు తెలిసిందే సత్యమని భావించి లేదా నమ్మి సేవ చేస్తూ ఉంటారు. ఇలాంటి ఆధ్యాత్మిక సేవలలో చాలామట్టుకు మతాలకు సంబంధించినవే. ఆత్మను గురించిన ఖచ్చితమైన సత్యాలు వారికి తెలియదు. వారికి తెలిసినవన్నీ

దాదాపు అసత్యాలే. ఈ సేవ చేసేవారు తమ భక్తుల పట్ల కొంత ప్రేమను కనబరుస్తూ ఉంటారు. నిజానికి వారు సేవలో చూపించే ప్రేమ సంపూర్ణమైనది కాదు. ఎందుకంటే వారి సేవలు పొందే వారు తమకు సేవ చేసే వారిని ఎప్పుడైనా ఏ విషయంలోనైనా ప్రశ్నిస్తే లేదా విభేదిస్తే వెంటనే వారు ప్రేమకు బదులుగా కోపాన్ని, అసహనాన్ని, వాగ్వాదాన్ని, అవసరమైతే శారీరక దాడులు, కుట్రలు కూడా చేస్తారు. ఇలాంటి ఆధ్యాత్మిక సేవలు ప్రపంచంలో కోకొల్లలుగా ఉన్నాయి. ఆయా రకాల ఆధ్యాత్మిక సేవలు చేసేవారిలోనే ఒకరంటే ఒకరికి గిట్టదు. కానీ వారందరూ చేసేది సేవే. కానీ ఒకరి పట్ల ఒకరికి పగ, ద్వేషం, అసూయ కలిగి ఆధ్యాత్మిక సేవ అన్న పేరుతో కొట్టుకు చస్తూ ఉంటారు. ఈ రకమైన అసత్య, ఆధ్యాత్మిక సేవలు చేసేవారు సర్వ మానవాళిని ప్రేమించలేరు. మేము గొప్ప మా సేవలు గొప్ప అని ఒకరినొకరు దూషించుకుంటూ విపరీత వికృతస్థాయిలో మారణహోమం సృష్టిస్తారు. అయినప్పటికీ మేము చేసేది ఆధ్యాత్మిక సేవ అని గట్టిగా నినదిస్తారు. ఒక మానవుని ద్వేషిస్తూ ఒక మానవుని ప్రేమిస్తూ చేసే దాన్ని కూడా వారు పవిత్ర ఆధ్యాత్మిక సేవ అని అంటారు. కారణం ఈ ఆధ్యాత్మిక సేవకులకు సత్యం తెలియదు కాబట్టి.

## నిజమైన సేవ

దేవుని రూపంలో నిర్మించబడిన సమస్త మానవాళిని పక్షపాతం లేకుండా దేవుని ప్రేమతో ప్రేమించి వారికి సత్య, సంపూర్ణ, శాశ్వత క్షేమము, మేలు కలుగు నిమిత్తమై తమ జీవితకాలమంతా కష్టనష్టాలను ఇష్టపూర్వకంగా సహిస్తూ భరిస్తూ కొనసాగటమే ఈ ప్రపంచంలో అతి శ్రేష్టమైన నిజమైన సేవ. ఈ సేవ చేయాలంటే మన జ్ఞానము, ఆస్తి, మన శక్తి సామర్థ్యాలు సరిపోవు. ఇట్టి సేవ ఈ ప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదు. చివరకు యేసుక్రీస్తు నందు విశ్వాసముంచిన విశ్వాసికి కూడా అసాధ్యం అనేలా అనిపిస్తుంది. మనమందరం విశ్వాసులమైనప్పటికీ, నిజమైన సేవ చేయాలనే దృఢ సంకల్పం ఉన్నప్పటికీ చాలామంది ఈ సేవను అర్థాంతరంగా ముగించినవారు ఉన్నారు. ఈ సేవను సంపూర్తిగా, విజయవంతంగా, తుదిశ్వాస వరకు వెలితి లేకుండా సర్వ మానవాళికి సంపూర్ణంగా సేవ చేసినవాడు ఒక్కడే. ఆయనే జగద్రక్షకుడైన యేసుక్రీస్తు. ఆయన మాత్రమే నిజమైన సేవ చేసి ఇది సాధ్యమే అని నిరూపించారు. అలాంటి సేవ చేయాలనుకునే వారికందరికీ ఆయనే శాశ్వత మాదిరి.

## నిజమైన సేవకుడు

యెషయా 42: 1-7 వచనములలో సేవకుడు, యజమానుడు, సేవ అనే విషయాలను స్పష్టంగా గమనించవచ్చు. నిజమైన సేవకుడు ఎలా ఉండాలి. ఎవరిని నిజమైన సేవకుడని నిర్ధారించవచ్చు. నిజమైన సేవకునికి ఉండవలసిన లక్షణాలను, స్వభావాలను గురించి ఈ వాక్య భాగంలో తెలుసుకుందాం.

## దేవుని సేవకుడు

ఈ లోకంలో నిజమైన సేవ చేసే ప్రతీ సేవకుడు మొదట తాను దేవునికి సంబంధించినవాడనని గుర్తుంచుకోవాలి. యెషయా 42:1-7వ చనములో దేవుడే స్వయంగా ఈ విషయాన్ని తెలియజేస్తున్నాడు.

నా సేవకుడు, నేను ఏర్పరచుకొనినవాడు, నా ప్రాణ ప్రియుడు, నేనే పిలిచాను, నేనే అతని చెయ్యి పట్టుకున్నాను, నేనే అతనిని నడిపిస్తున్నాను, నేనే అతనిని వెలిగించి ఉన్నాను, నేనే అతనిని కాపాడుచున్నాను, నా ఆత్మను అతని యందుంచియున్నాను, నేనే అతనిని ఆదుకుంటాను

దేవుని సేవ చేసే ప్రతి ఒక్కరూ తాను దేవుని సేవకుడనని, దేవుడే తనను తన సేవ కొరకు ఏర్పరచుకున్నాడని, మనుషులు ఏర్పరచుకొనలేదని, దేవుడే తనను పిలిచాడని మనుషులు పిలవలేదని దేవుడే తన చేయి పట్టుకున్నాడని, నడిపిస్తున్నాడని, చీకటిలో ఉన్న వారికి వెలుగు కలుగుటకై తనను వెలుగుగా నియమించాడని ఆయనే తనను కాపాడుచున్నాడని గ్రహించాలి. నీవు ఆయన పనిని ప్రారంభించక మునుపే నిన్ను గూర్చి తృప్తిగా ఆనందిస్తున్నాడు. ఆయన అప్పగించిన పనిని సమర్థవంతంగా, విజయవంతంగా నెరవేర్చడానికి నీకు సహాయకారిగా ఉండడానికి నీయందు తన ఆత్మను ఉంచాడు. ఆయన అప్పగించిన పనిలో ఎన్నడూ తప్పిపోకుండా నిన్ను ఆదుకుంటాడు.

బహుశా ఇదంతా యేసు క్రీస్తును గూర్చిన ప్రవచనము అని నీవు అనుకోవచ్చు. అయితే

ఆయన నిన్ను, నన్ను మనందరినీ తన సేవకులగా ఆయన సేవలో యేసుక్రీస్తు లాగానే తన పనిని మనతో చేయించుకోవాలని ఆయన కోరిక. అలాగైతే మనమందరము ఆయన సేవకులమే. మనమందరము చేసేది ఆయన సేవయే. దేవుడు పక్షపాతికాడు. మనలను కూడా తన సేవకులుగా అంగీకరించి, అవసరమైన సామర్థ్యాన్ని అనుగ్రహించి తన సేవలో వాడుకుంటాడు. 1పేతురు 2:9లో దేవుడే మనలను తన పనికి పిలిపిస్తున్నాడు. 2పేతురు 1:2 ప్రకారము ఆయనే తన శక్తిని, అనుభవ జ్ఞానమును, జీవమును, భక్తిని, మనకు కావలసిన అనేకమైన వాటిని మనకు దయచేస్తున్నాడు.

## దేవునిసేవ-త్యాగం

దేవుని పనిలో ఈ రెండూ విడదీయరానివి. సేవ లేకపోతే త్యాగాన్ని ప్రదర్శించడానికి అవకాశం ఉండదు. త్యాగము లేకపోతే ఆయన లాగా సేవించలేం. యేసుక్రీస్తు త్యాగపూరితంగా సేవ చేశాడు. ఆయన శిష్యులు కూడా త్యాగపూరితంగా సేవ చేశారు. అనేకమంది ప్రస్తుత కాల దైవ సేవకులు ఆ మాదిరినే అనుసరిస్తూ నిజమైన దైవ సేవకులుగా కొనసాగుతున్నారు.


## దేవుని సేవలో యేసుక్రీస్తు త్యాగం

త్రిత్వములోని తండ్రి, పరిశుద్ధాత్మలతో సమాన స్థాయి కలిగిన యేసుక్రీస్తు కుమారుడైనప్పటికీ సేవకుడిగా పిలవబడడానికి ఇష్టపడ్డాడు. యెషయా 42:1లో తనకు అప్పగింపబడిన పనిని సమర్థవంతంగా నెరవేర్చడానికి ఆయన కుమారత్వమును త్యాగం చేసి సేవకుడుగా పిలువబడ్డాడు. అయితే సేవకుని స్థాయికి తన్ను తాను తగ్గించుకున్న యేసుక్రీస్తును తండ్రియైన దేవుడు "ఈయన నా ప్రియ కుమారుడు" అనిసంబోధించాడు (మత్తయి17:5, మార్కు 9:7, 2 పేతురు 1:17).

దేవుని స్వరూపము గలవాడైయుండి దేవునితో సమానంగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచుకొనక మనుషుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్ను తాను రిక్తునిగా చేసుకున్నాడు. సిలువ మరణం పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకున్నాడు (ఫిలిప్పీ:2:6-8). కానీ యేసుక్రీస్తు విధేయత, తగ్గింపును బట్టి దేవుడు ఆయనను అత్యధికంగా హెచ్చించాడు (ఫిలిప్పీ 2:9-11).

యేసుక్రీస్తు తనను కొట్టు వారికి తన వీపును అప్పగించాడు. తన వెంట్రుకలు పెరికివేయు వారికి ఆయన తన చెంపలను అప్పగించాడు. అవమానపరచు వారికి ఆయన తన ముఖమును దాచుకొనలేదు. తన ముఖమును చెకుముకి రాతి వలె చేసుకున్నాడు. అయితే తండ్రియైన దేవుడు సహాయం చేశాడు కాబట్టి ఆయన సిగ్గు పడలేదు (యెషయా 50:6, 7)

మన ప్రభువైన యేసుక్రీస్తు మన రక్షణ కొరకు చేసిన సంపూర్ణమైన త్యాగాన్ని గూర్చి యెషయా 53:2-12లో బహు స్పష్టంగా తెలుసుకోవచ్చు. యేసుక్రీస్తు తన స్వరూపాన్ని కోల్పోయారు. సొగసు లేదు. తృణీకరించబడ్డాడు. విసర్జించబడ్డాడు. వ్యసనాక్రాంతుడయ్యాడు. వ్యాధిని అనుభవించాడు. మనుషులు చూడనొల్లనివాడయ్యాడు. మన రోగములను భరించాడు. మన వ్యసనములను వహించాడు. మన దోషములను భరించాడు. ఆయన మొత్తబడ్డాడు. దేవుని చేతనే బాధించబడ్డాడు. గాయపరచబడ్డాడు. నలుగగొట్టబడ్డాడు. అందరి దోషమును ఆయన మీద వేసుకున్నాడు. అందరి శిక్ష ఆయన మీద వేసుకున్నాడు. దౌర్జన్యం పొందాడు బాధించబడ్డాడు. నోరు తెరవలేదు. అన్యాయపు తీర్పు పొందాడు. సజీవుల భూమిలో నుండి కొట్టివేయబడ్డాడు. తన్ను తానే అపరాధ పరిహారార్థబలిగా చేసుకున్నాడు. తనకు కలిగిన వేదనను చూసి తృప్తి పొందాడు. మన దోషములను భరించాడు. తన ప్రాణమును ధారపోశాడు. అతిక్రమము చేయు వారిలో ఒకడిగా ఎంచబడ్డాడు. అనేకుల పాపములను ఆయనే భరించాడు.



ఈవిధంగా మన ప్రభువు మన రక్షణ కొరకు చేసిన త్యాగాన్ని గూర్చి ఇంకా వివరంగా రాయాలంటే ఆకాశమంత కాగితమైనా సరిపోదు. ఆయన మాత్రమే కాదు ఆయన శిష్యులు ఆయన యందు విశ్వాసం ఉంచిన అనేకమంది దైవజనులు, మిషనరీలు, సు-వార్తికులు, సంఘ నాయకులు, పరిచర్య కోసం చేసిన త్యాగం విస్తారమైనది, అది లెక్కించటానికి సాధ్యం కాదు, అంత మాత్రమే కాదు మన యుఇయస్ఐ పరిచర్య వ్యవస్థాపకులు, సీనియర్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థుల పరిచర్య కోసం విస్తారంగా త్యాగం చేసి మన ముందు మాదిరిగా ఉన్నారు. ప్రస్తుత కాలంలో సైతం చాలామంది గ్రాడ్యుయేట్స్, విద్యార్థులు త్యాగ పూరితమైన పరిచర్య చేస్తూ కొనసాగుతున్నారు.

ప్రియ సహోదర, సహోదరీ మన ప్రభువు మనకు అప్పగించిన సేవ నిజమైన సేవ. సర్వ మానవాళిని రక్షణార్థమైన ప్రేమతో ప్రభువు వద్దకు నడిపించాలి. ఇందు నిమిత్తం ప్రభువు చేసి చూపించిన త్యాగం మనం కూడా అనుసరించాలి. అలా త్యాగపూరిత సేవ చేయడం క్రీస్తుకు మాత్రమే సాధ్యం, మనకు సాధ్యం కాదు అని అనకూడదు. పౌలు కొలస్సీ సంఘం కొరకు త్యాగపూరిత సేవ ఎలా చేశాడో కొలస్సీ 1:24లో చెప్పాడు. "మీ కొరకు నేను అనుభవిస్తున్న శ్రమల యందు సంతోషించుచు సంఘము అను ఆయన శరీరం కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను." కాబట్టి మనం కూడా దేవుడు మనకు అప్పగించిన విద్యార్థుల పరిచర్యలో ఎదురవుతున్న శ్రమలలో సంతోషించాలంటే మనం కూడా చాలా విషయాలను ప్రభువు వలె, ఆయన మాదిరిని అనుసరించిన మన పితరులు, మన సీనియర్ గ్రాడ్యుయేట్స్ వలె త్యాగం చేయాలి. అది నష్టం కాదు. మనకు తెలియకుండానే మనకు కలిసివచ్చే గొప్ప లాభం. నీవు ఎంత త్యాగం చేస్తే అంతకు అనేక రెట్లు నీవు ఆత్మీయ దీవెనలు పొందుతావే కానీ నష్టపోవు. సంతోషంగా త్యాగం చేసి క్రీస్తుకు సాక్షిగా, క్రీస్తు త్యాగానికి సాక్షిగా నీ జీవితాన్ని, నీకున్న వనరులను పరిచర్య కోసం త్యాగం చేయమని ప్రేమ పూర్వకంగా కోరుచున్నాను. దేవుడు మిమ్మల్ని దీవించును గాక.

**- టి.ఆర్. రవి రాజేంద్ర,** ప్రొద్దుటూరు

కవిత

# దిద్దుబాటు లేకపోయినా...



దిద్దుబాటును ఇష్టపడని క్రైస్తవ సమాజం...
క్రైస్తవేతర సమాజాన్ని సరిదిద్దుతానంటోంది.

దైవవాక్యంలో ప్రస్ఫుటంగా రాసినా
దైవజనులచేత విస్పష్టంగా వింటున్నా
తనలోని లోపాలు కళ్ళెదుటే కదిలాడుతున్నా...
తప్పించుకొనే కారణాలు వెదుకుతుందే కానీ...
సరిచేసుకోవడానికి ఇష్టపడడం లేదు.

పరిశుద్ధాత్మ దేవుడు ప్రతి క్షణమూ ప్రబోధిస్తున్నా...
మనస్సాక్షి మరలా మరలా గద్దిస్తున్నా...
వాత వేయబడిన మనస్సాక్షిలా మారుతుందే కానీ...
లోబడే విధేయత చూపించడం లేదు.

దేవుని మాట కంటే మానవుల చేష్టలకే
ప్రాధాన్యతనిస్తూ...
దేవుని నీతి కంటే స్వనీతినే స్వేచ్ఛగా నమ్ముకొంటూ
ప్రాపంచిక పోకడలో పరుగులాడుతుందే కానీ...
ప్రభువు చెప్పిన ప్రమాణాలను పాటించడం లేదు.

ప్రకటనకూ, ప్రవర్తనకూ ఏమాత్రం సమతూకం
లేకపోయినా...
క్రైస్తవ సత్యాలు, క్రైస్తవుల జీవితాలలో నేతిబీర
చందమైనా...
క్రైస్తవులలోని లోపాలను ప్రపంచం వేలెత్తి
చూపిస్తున్నా

ప్రభుయేసుని సత్య సువార్త ప్రకటిస్తానంటోంది.
ప్రభువు దగ్గరకు ప్రజలను నడిపిస్తానంటోంది.
ప్రభుయేసుని శిష్యులుగా తయారు చేస్తానంటోంది.

**- రవికుమార్,** అద్దంకి




# దేవుడిని వాడుకొనే మనుష్యులు

నేటి క్రైస్తవ సమాజంలో కొందరు వ్యక్తులు భక్తిని స్వార్థం కొరకు, పరిచర్యను హోదా కొరకు, వ్యాపారంగాను చేస్తున్నారు. వీరు 'దేవుని చేత వాడబడే వారు' కాదు 'దేవునిని వాడుకునేవారు'. బైబిల్‌లో కూడా కొందరు దేవునిని వాడుకోవాలని ప్రయత్నించి ఆత్మీయత లేనివారై, జీవితంలో నష్టపోయి, పర్యవసానాలు అనుభవించారు. ఇలా దేవుని వాడుకోవాలనుకునే వారి లక్షణాలు ఏంటి? పర్యవసానాలు ఎలా ఉంటాయి? దేవుని వాక్యం అలాంటి వారి గూర్చి ఏమి చెప్తుంది అనే విషయాలు చర్చిద్దాం.

### 1. దేవుని పట్ల నిర్లక్ష్యం

దేవుడిని వాడుకునే మనుష్యులకు దేవుడు అంటే గౌరవం, భయం, భక్తి ఉండదు. దేవుని వాక్యాన్ని నిర్లక్ష్య పెడతారు. దేవుని ప్రేమించరు, ఆయనకు విధేయత చూపరు కానీ, దేవుని ఆశీర్వాదాలు కావాలని ఆశిస్తారు. ఆచారాలను అనుసరిస్తారు కానీ ఆత్మీయత ఉండదు. ఆపదల్లో, కష్టాల్లో దేవుడు సహాయం చేయాలని ఆశిస్తారు.

ఇశ్రాయేలీయులు కూడా దేవుని ఆజ్ఞలు, నిబంధనలు నిర్లక్ష్య పెట్టి అనేకసార్లు విగ్రహాలను పూజించారు. కానీ కష్టాల్లో దేవుని సహాయం కోరుతూ వచ్చారు. ఏలీ కుమారులైన హొఫ్నీ, ఫినెహాసు యాజకులుగా ఉన్నారు. తండ్రి వారసత్వం ద్వారా యాజకులయ్యారే గానీ దేవుని ఎరుగని వారు. అందుకే వారు దేవుని ఆజ్ఞలను, పవిత్ర ఆచారాలను నిర్లక్ష్యం చేశారు. ఇష్టానుసారంగా, అపవిత్రమైన జీవితాలు జీవించి, ఆపద వచ్చినప్పుడు దేవుణ్ణి వాడుకోవాలని ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నారు (1 సమూయేలు 4:1–21). దేవునిని వాడుకోవాలని ప్రయత్నించేవారు వ్యక్తిగతంగా నష్టపోతారు, సంఘానికి, సహవాసానికి నష్టాన్ని తెస్తారని వీరిని చూస్తే అర్థమవుతుంది.

నేటి దినాల్లో కూడా కొందరు దేవునితో వ్యక్తిగత సంబంధం లేకుండా లేదా ఆత్మీయ జీవితంలో వెనుకబడి, నిజమైన ఆత్మీయత లేకుండా వారి అవసరాల కొరకు దేవుని అడ్డం పెట్టుకొని జీవిస్తున్నారు. ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి. అందుకే యేసుక్రీస్తు పేతురుతో మాట్లాడుతూ నన్ను

దేవుని సన్నిధిలోనే నిరంతరం జీవితాన్ని గడిపే గెహాజీ 'దేవుడు నన్ను చూడడులే' అనుకోవడం నిజంగా ఆశ్చర్యం. ఆ నకిలీ ధీమాయే అతన్ని నట్టేట ముంచింది. పరలోక సంబంధమైన, దైవికమైన విలువల కోసం దేవుని చేత అభిషేకించబడిన జీవితాన్ని, తుచ్ఛమైన లోకసంబంధమైన కానుకల కోసం పణంగా పెట్టి అతను భ్రష్టత్వాన్ని, చరిత్రహీనతను చివరికి ఎంతో హేయమైన కుష్ఠురోగాన్ని కొనితెచ్చుకున్నాడు. గెహాజీలుగా మారటం బహు తేలిక. కాని ఎలీషాల్లాగా నియమనిష్టలతో బతకడం చాలా కష్టం.

ప్రేమించుచున్నావా అన్నాడు, ప్రేమిస్తే పరిచర్యను అప్పగించాడు. దేవుని ప్రేమించే వారు దేవుని ఆజ్ఞలను గైకొంటారు ఆయన మాటలకు విధేయత కలిగి జీవిస్తారు (యోహాను 21:15–18;14:21).

## 2. జవాబుదారీతనం లేకపోవడం

దేవుడిని వాడుకోవాలనుకునేవారికి జవాబుదారీ తనం ఉండదు. వారు తమ వ్యక్తిగత జీవితంలో, తలాంతులు, ఆర్థిక వనరులు, పరిచర్య విషయాల్లో వారికి నచ్చినట్లు, ఇష్టమైనట్లు చేస్తుంటారు. దేవునికి లెక్క అప్పగించాలనే భయం కానీ, సహవాసానికి జవాబుదారులం అనే ఆలోచన గాని లేకుండా ఉంటారు. విచ్చలవిడి జీవితాన్ని కలిగి పరిచర్యలో యజమానుల్లాగా ఉంటారు. ఆర్థిక విషయాల్లో పారదర్శకత ఉండదు. మొత్తం వారే చూసుకుంటారు. ఎవరైనా లెక్క అడిగితే 'దేవుడు మిమ్మల్ని శిక్షిస్తాడు మమ్మల్ని అడిగితే' అని సహవాసంలో వ్యక్తులను భయపెడతారు. ఇచ్చిన వనరులను మరియు బాధ్యతలను దుర్వినియోగం చేస్తారు. దేవుడు ఇచ్చిన బాధ్యతలను హోదాగా భావిస్తారు, వారి స్వార్థం కోసం అవసరాల కోసం వాడుకుంటారు. ఏలీ కుమారులైన హోఫ్నీ, ఫీనెహాసులకు దేవుడంటే లెక్కలేదు, తండ్రి గద్దించినా సరిచేసుకోలేదు. అంటే జవాబుదారులుగా ఉండలేదు. అందువల్ల వారు దేవుడిచ్చిన వనరులను స్వార్థ ప్రయోజనాల కొరకు దుర్వినియోగం చేశారు (1 సమూ 2:17,22–25).

ప్రస్తుతం ఉన్న సంఘాల్లో, సహవాసాల్లో జవాబుదారీతనం తక్కువగా ఉంది. కానీ దేవుని వాక్య ప్రకారం దేవునికి, సహవాసంలో ఇతరులకు క్రియలు, ఆలోచనలు, నిర్ణయాలు, ప్రవర్తన, వనరులు, తలాంతులు విషయాల్లో లెక్క అప్పగించ బద్ధులమై ఉన్నాము (రోమా 14: 12, 2 కొరింథీ 5:10).

## 3. అనైతిక ప్రవర్తన

దేవుణ్ణి వాడుకునే మనుష్యులు దేవుని వాక్యపు విలువలను పాటించరు. వాక్యాన్ని లైట్‌గా తీసుకుంటారు. వారి నైతిక ప్రవర్తనకు వాక్యాధి కారం ఉండదు కాబట్టి, వారు అనైతికంగా జీవిస్తారు. రహస్య పాప జీవితాన్ని కలిగి ఉంటారు. కొన్నిసార్లు పాపం బహిర్గతమైనా దాన్ని సమర్థించుకుంటూ నిర్భయంగా, దురుసుగా ప్రవర్తిస్తారు. వ్యక్తిగత, వివాహ, సంఘ, సహవాస జీవితంలో పారదర్శకత లేకుండా జీవిస్తారు. ఏకాంతత పేరుతో మనుష్యులకు దూరంగా ఉంటారు. ఏలీ కుమారులైన హోఫ్నీ, ఫీనేహాసులు వ్యభిచార పాపంలో కూరుకుపోయారు. వ్యభిచార పాపం బహిరంగంగా చేసేటంత బరితెగించారు (1 సమూ 2:22,23).

ప్రస్తుత దినాల్లో దేవుడిని వాడుకునేవారు ఇలాంటి అనైతిక ప్రవర్తన కలిగి ఉన్నారు. అక్రమ సంబంధాల్ని కలిగి ఉండడం, రెండు వివాహాలు చేసుకోవడం, విడాకులను ప్రోత్సహించడం, అది తప్పు కాదు అని బోధించడం. అశ్లీల దృశ్యాలను చూడడం, యల్‌జిబిటి సంబంధాలను ప్రోత్సహించడం, కలిగి ఉండడం లాంటివి చూస్తుంటే వీరు ఎంత నైతికంగా దిగజారారో అర్థమవుతుంది. విగ్రహారాధన, శరీర కార్యాలు చేస్తూ దేవుని అడ్డుపెట్టుకొని పైకి భక్తిగా కనబడడానికి ప్రయత్నిస్తారు. ఇలా వీరు దేవుని అడ్డుపెట్టుకొని బూతులు మాట్లాడడం, అబద్ధాలు చెప్పడం మనుష్యులను అవసరాల కోసం పొగడడం, మద్యం తాగడం, మద్యపానం తప్పుకాదని చెప్తూ అనేక అపవిత్ర కార్యాలు కలిగి ఉంటారు. కట్నాలు, కులాలను ప్రోత్సహించడం చేస్తారు. కానీ వాక్యం ఈ అనైతిక ప్రవర్తన ఏ రూపంలో ఉన్నా దానిని తీవ్రంగా ఖండిస్తుంది (ఎఫెసీ 5:3, 1 కొరింథీ 6: 18, గలతీ 5:19–21, 1థెస్సలోని 4:3–5)

## 4. అవినీతి, దురాశ

దేవుడిని వాడుకునేవారు అవినీతిపరులుగా,

దురాశ గలవారిగా ఉంటారు. లంచాలు ఇవ్వడం, డబ్బును దుర్వినియోగం చేయడం, విలాసాలకు దేవుని డబ్బులు ఖర్చు చేయడం, విలాసవంతమైన భవనాలు, వస్త్రాలు, వస్తువులు, టూర్లకు వాడుకొంటూ దేవుని పేరు చెప్తారు. పన్నులు ఎగగొట్టడం, లంచాలు ఇచ్చి తప్పుడు మార్గాల్లో పనులు జరిపించుకోవడం, రాజకీయ నాయకులు, పార్టీలకు డబ్బు ఖర్చు పెట్టడం లాంటివి చేస్తారు. వీరు దేవుని పేరు చెప్పి ధనం అర్థించడం, ధనవంతులు అవ్వాలనే ఆశ, దేవునికి ఇస్తే దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు లేకపోతే ఆశీర్వాదం ఉండదని భయపెట్టి డబ్బులు తీసుకోవడం, శ్రమ దోపిడీ చేయడం, భౌతిక ఆశీర్వాదాలు ఆశ చూపి లాభపడాలని ఆశిస్తారు. ధన సంపాదన ధ్యేయంగా ఉంటారు. భక్తి, పరిచర్య అంతా ధనం కొరకే చేస్తారు. అవినీతి, దురాశ అనేవి నైతిక పతనానికి, ఆత్మీయ నాశనానికి, దయనీయస్థితికి నడిపిస్తాయి(రోమా 6:23 మార్కు 4:19, 1 తిమోతి 6: 10).

అయితే యేసుక్రీస్తు దీని విషయమై హెచ్చరించారు, దేవుని విషయమై ధనవంతులై ఉండడమే ఆశీర్వాదం అని చెప్పాడు (లూకా12:15–21) బైబిల్‌లో గెహాజీ ఇలాంటి దురాశ కలిగి ఎలా తన జీవితాన్ని నష్టపోయాడో మనం చూడొచ్చు.

ఏలియా, ఎలీషా వంటి మహా ప్రవక్తల జాబితాలో చేరవలసిన అద్భుతమైన జీవితం గెహాజీది. ఎలీషా వంటి మహాప్రవక్తకు అనుచరుడుగా, దేవునికి అతి సమీపంగా, దేవుని అద్భుత కార్యాలెన్నింటికో ప్రత్యక్షసాక్షిగా ఎంతో ఉజ్వలంగా సాగిన గెహాజీ జీవితాన్ని 'దురాశ' పట్టి పీడించింది. దేవుడిచ్చిన వాటితో తృప్తి పడకుండా, తనకు చెందని, తాను ముట్టకూడని 'కానుకలను' దొంగచాటుగా స్వీకరించడమే గెహాజీ చేసిన పాపం. దేవుని సన్నిధిలోనే నిరంతరం జీవితాన్ని గడిపే గెహాజీ 'దేవుడు నన్ను చూడదులే' అనుకోవడం నిజంగా ఆశ్చర్యం. ఆ నకిలీ ధీమాయే అతన్ని నట్టేట ముంచింది. పరలోక సంబంధమైన, దైవికమైన విలువల కోసం దేవుని చేత అభిషేకించబడిన జీవితాన్ని, తుచ్ఛమైన లోకసంబంధమైన కానుకల కోసం ఫణంగా పెట్టి అతను భ్రష్టత్వాన్ని, చరిత్రహీనతను చివరికి ఎంతో హేయమైన కుష్ఠురోగాన్ని కొనితెచ్చుకున్నాడు. గెహాజీలుగా మారటం బహు తేలిక. కాని ఎలీషాల్లాగా నియమనిష్టలతో బతకడం చాలా కష్టం.

## 5. పేరు ప్రఖ్యాతుల కొరకు ప్రాకులాట

దేవుడిని వాడుకునే వారు దేవుని పేరు చెప్పి పాపులర్ అవ్వాలని సమాజంలో పలుకుబడి సాధించాలని చూస్తారు. బాధ్యతలను అధికారం చలాయించడానికి వాడతారు. వారి మాటే శాసనం, వారు చేసేదే సరియైనది అని భావిస్తారు. అందరూ వారి మాటే వినాలని, వారి ఘనత కొరకు, వారి సొంత సామ్రాజ్యాన్ని నిర్మిం చుకోవడానికి ప్రాకులాడుతారు. వీరికి దేవుని రాజ్యం నీతి పట్టదు. ఫ్లెక్సీలో, బ్యానర్లో వారి పెద్ద పెద్ద ఫోటోలు కనబడాలి. ప్రకటనల్లో, టీవీల్లో ఎక్కువగా కనబడడానికి ఇష్టపడతారు. ఇంకా కొంతమంది కుటుంబ షోలు చేస్తుంటారు. పరిచర్య అనే ముసుగులో ప్రసంగ వేదికలను పాపులారిటీకి అవకాశాలుగా భావిస్తారు. వారిని గూర్చి గొప్పలు చెప్పుకుంటారు. కొందరు చాలా బిజీగా ఉన్నామని, ఇంటర్నేషనల్ ప్రసంగీకులమని పిలిపించుకోవడానికి ఇష్టపడతారు. వీరు యేసుక్రీస్తుకు శిష్యులను తయారు చేయక వారి కొరకు శిష్యులను తయారు చేసుకుంటారు. ఏమి చేసినా పేరు రావాలని, తమ గురించి అందరూ మాట్లాడుకోవాలని కోరుకుంటారు. వ్యక్తి పూజను ప్రోత్సహిస్తారు. వారి చుట్టూ ఉన్నవారు దురభిమాన పాపంలో పడేటట్లు చేస్తారు. వీరు సమిష్టి నాయకత్వాన్ని ఒప్పుకోరు. సేవకులుగా ఉండడానికి తగ్గించుకొనే వాటి యందు మనసు కలిగి ఉండడానికి ఇష్టపడరు. వీరు అధికారం కొరకు తిరుగుబాటు చేసిన కోరహు లాంటి వారు.



వాక్యం ఇలాంటి ప్రవర్తనకు వ్యతిరేకంగా బోధిస్తుంది (ఫిలిప్పీ2:3-5) సేవచేయడాన్ని, తగ్గించుకొనే వాటియందు మనసు ఉంచడాన్ని, క్రీస్తు యేసునకు కలిగిన మనసు కలిగి ఉండడాన్ని, సమిష్టి నాయకత్వాన్ని, దేవుని నామ ఘనత కొరకు పని చేయాలని చెబుతుంది.

## 6. స్వార్థంతో కూడిన లక్ష్యం లేక ఆశయం

దేవుడిని వాడుకొనేవారు స్వార్థంతో కూడిన లక్ష్యాలు లేక వాంఛలు కలిగి ఉంటారు. పెద్ద సంఘం, సహవాసం అని పిలిపించుకోవాలని, నిర్దిష్ట సమయంలో పెద్ద చర్చి నిర్మాణం చేపట్టాలని, వారు బాధ్యతలు కలిగి ఉన్నప్పుడు ఏదో ఒక కొత్త ప్రాజెక్టు చేయాలని, ఎక్కువ బాప్తీస్మాలు, ఎక్కువ విరాళాలు సేకరణ, ఎవరూ చేయలేనిది చేశామని చెప్పుకోవాలనే కోరిక, రికార్డులు సృష్టించాలని తపన కలిగి ఉంటారు. వ్యక్తిగత జీవితంలో కూడా వారి ఉద్దేశ్యాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రణాళిక వేసుకుంటారు. కుటుంబం, ఉద్యోగం, పిల్లల విషయాల్లో ఇదే విధానాన్ని అనుసరిస్తారు. కానీ వీటిని నెరవేర్చుకోవడానికి దేవుని పేరు వాడుకుంటారు. దేవుని చిత్తాన్ని వీరు లక్ష్యపెట్టరు. దేవుని యొక్క నడిపింపు, పద్ధతి పట్టించుకోరు. దీనికి దేవుని చిత్తమని, దర్శనాలని, భారం ఇచ్చాడనే రంగు అద్దుతారు. వీరి ఆశయాలు నెరవేర్చుకుంటారు. యూదుడైన స్కెవయ కుమారులు ఇలానే ప్రవర్తించారు (అపో.కా. 19:13-16).

అయితే బైబిల్ దీనితో ఏకీభవించదు. సౌలు యొక్క గర్వము, సొంత ఆశయాలు తనని పతనానికి నడిపించాయి (1సమూ 15:1-35). యేసుక్రీస్తు ఈ లోకంలో తండ్రి ఆశయాన్ని నెరవేర్చడానికి వచ్చారు. అందుకే మన ఆలోచనలు, ప్రణాళికలు, లక్ష్యాలు, దేవుని సర్వాధికార చిత్తానికి సరిపోవాలి. దేవుని ప్రణాళిక ఉద్దేశాల యందు నమ్మిక ఉంచాలి (యిర్మీయా 29:11).

## 7. వేషధారణ

దేవునిని వాడుకునేవారు నీతిమంతులుగా కనబడాలని కోరుకుంటారు. అంతరంగ జీవితంలో భక్తి లేకపోయినా బాహ్యంగా చాలా భక్తిపరులుగా నటిస్తారు. వారి ఉపవాసం, వారి ధర్మకార్యాలు,



ప్రార్థన, ఆరాధనల వంటి వాటిలో భక్తిపరులని మనుష్యులు అనుకోవాలని కోరుకుంటారు. వారు ప్రార్థన చేస్తే గొప్ప కార్యాలు జరిగాయని చెప్పుకుంటారు. తద్వారా మనుష్యులు వారు గొప్ప భక్తి పరులని, వరాలు ఉన్నాయని చెప్పుకోవాలని కోరుకుంటారు. వారి మాటలలో భక్తి కనపరుస్తారు. వీరు బైబిల్ భాష బాగా వాడుతారు. వీరు పైకి కనిపించేది వేరు, అంతరంగ వాస్తవం వేరుగా ఉంటుంది. వారి బాహ్య ప్రవర్తనకు, అంతరంగ ఆలోచనలు, ఉద్దేశాలు విరుద్ధంగా ఉంటాయి. యధార్థంగా ఉండరు. ఆత్మీయంగా గుడ్డివారుగా ఉంటారు. వీరికి వాస్తవంగా దేవునితో ఎలాంటి సంబంధం ఉండదు కానీ మతాచారాల యందు అతిశయిస్తారు. ఇలా వీరు స్వీయతృప్తిని పొందు కుంటారు. స్వనీతిపరులుగా ఉంటారు. భక్తి ఆచారాలలో ఉందనుకుంటారు. ఇలాంటి వారికి పరిసయ్యులు, అననీయ సప్పీరాలు ఉదాహరణలు (మత్తయి 23:1-36, అపోస్తుల 5:1-11) యేసు క్రీస్తు వేషధారణను తీవ్రంగా ఖండించారు. దేవుడు వేషధారణను అసహ్యించుకుంటాడు.

## ముగింపు

దేవునిని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవాలనుకునే వారు ఇలాంటి లక్షణాలు కనబరుస్తారు. మనం ఎప్పుడూ దేవునిని మన స్వార్థ ప్రయోజనాలకు వాడుకోకూడదు. దేవుని యందు దృఢవిశ్వాసం కలిగి, ఆయన వాక్యాన్ని ప్రేమించి విధేయత చూపాలి. యేసుక్రీస్తును వెంబడిస్తున్నప్పుడు కొన్ని నష్టపోవాల్సి వచ్చినా, ఆయన సర్వాధికారానికి లోబడి, ఆయన ప్రణాళిక, ఉద్దేశాల యందు నమ్మిక ఉంచాలి. మనం ఎప్పుడూ దేవునిని వాడుకోవాలని కాకుండా దేవుని చేత వాడబడాలని కోరుకుందాం. అలా దేవుని చేత వాడబడడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక!

– ఆర్. రాజ్‌కుమార్, స్టాఫ్, తిరుపతి



షెప్పర్డ్ సెల్

# పరిచర్యలో సీనియర్ గ్రాడ్యుయేట్స్ పాత్ర?

యుఇయస్ఐ ఒక అద్భుతమైన సహవాసం. ఇందులో విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ భాగస్వాములు. కుటుంబాలకు, క్రైస్తవ సంఘానికి, సమాజానికి ప్రయోజనకరమైన పరిచర్యకు కావలసిన దర్శనాన్ని యుఇయస్ఐకి దేవుడు అనుగ్రహించాడు.

## పరిచర్యలో సీనియర్ గ్రాడ్యుయేట్స్ ఆవశ్యకత

ఈ పరిచర్య దేశాన్ని నిర్మిస్తుంది. అనుభవజ్ఞులైన గ్రాడ్యుయేట్స్ విద్యార్థులను, యంగ్ గ్రాడ్యుయేట్స్‌ను నడిపించడం అంటే మనము దేశాన్ని నిర్మిస్తున్నట్లే. మనము ఈ పరిచర్యలో ఎంతో ఆశీర్వదించబడ్డాము. కాబట్టి మనము ఇవ్వబద్దులం. గ్రాడ్యుయేట్స్ విద్యార్థుల సమస్యలకు తగిన అనుభవాలతో కూడిన జవాబులు ఇవ్వగలరు. దేవుడు మనకు ఎన్నో రిసోర్సెస్ అనుగ్రహించాడు. కొంత దేవుని పరిచర్యకు సమర్పించవచ్చు. ఈ పరిచర్యలో సీనియర్ గ్రాడ్యుయేట్స్ పాత్ర చాలా ప్రాముఖ్యమైనది. వారిలో చాలామంది విద్యార్థులుగా ప్రభువును నమ్ముకొని ఆధ్యాత్మికంగా ఎదుగుచూ గ్రాడ్యుయేట్స్‌గా మారి ఎన్నో అనుభవాలతో నిండినవారై వయసులో పెద్దవారవుతూ ఉంటారు. ఈ సహవాసంలో అన్ని వయసుల వారికి తగిన బోధ, వారు చేయతగిన పరిచర్య ఉండటం ఎంతో భాగ్యం. దేవుని వాక్యం వృద్ధాప్యాన్ని ఒక భాగ్యంగానే ఎంచుతుంది. తల నెరపు వృద్ధులకు సౌందర్యము (సామె 20:29). సీనియర్ గ్రాడ్యుయేట్స్ యుఇయస్ఐ సహవాసం దర్శనం నుండి తప్పిపోకుండా చూడడం, అవసరమైన ఆర్టికల్స్ రాయడం, క్లిష్టపరిస్థితులలో సహవాసంలో సమాధానం కల్గించడం లాంటి ప్రాముఖ్య విషయాలలో పాల్గొంటూ, ఈ క్రింది విషయాలలో సహాయకులుగా ఉండవచ్చును.

## సలహా పరిచర్య

వయస్సును బట్టి వారు క్రియాశీలక బాధ్యతలు చేపట్టలేకపోవచ్చు కాని వారి అనుభవాలు కుటుంబాలకు, క్రైస్తవ సంఘాలకు, సమాజానికి ఎంతో ఆశీర్వాదకరంగా ఉంటాయి. మోషే ప్రత్యేక పిలుపుతో దేవుని పని చేపట్టాడు. ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తునుండి విడిపించాడు. ఉదయం మొదలుకొని సాయంకాలం వరకు ప్రజలకు ఒక్కడే న్యాయము తీర్చుచూ ఉండగా తన మామ అయిన యిత్రో – ఈ పని నీకు మిక్కిలి భారము అది నీవు ఒక్కడవే చేయలేవని, సామర్థ్యము, దైవభక్తి గల కొందరిని సహాయకులుగా నియమించుకోమని సలహా ఇవ్వగా, మోషే సలహాను పాటించాడు (నిర్గమ 18:13-26). క్లిష్టపరిస్థితులలో సీనియర్ గ్రాడ్యుయేట్స్ సహవాస క్షేమం కొరకు దైవిక సలహాలు ఇచ్చి సహాయపడాలి.

## యంగ్ గ్రాడ్యుయేట్స్‌ను మెంటర్ చేయడం

వేగంగా పనులు జరగాలనే ఆలోచన గల యుగంలో మనం జీవిస్తున్నాము. విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ సమయం ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా వారిని

ఆధ్యాత్మికంగా ప్రభావితం చేయవలసిన బాధ్యత సీనియర్ గ్రాడ్యుయేట్స్ మీద ఉంది. యేసు ప్రభువు శిష్యులను తీర్చిదిద్దాడు. వారు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా వారిని సరిదిద్ది ధైర్యపరచి దేవుని రాజ్యాన్ని కట్టడానికి ప్రోత్సహించారు. పౌలు, తిమోతి, తీతులకు సమయమిచ్చాడు. అకుల ప్రిస్కిల్ల, అపొల్లోను సరిదిద్దారు (అపో.కా 18:24-28). అపొల్లో తర్వాత దినాల్లో గొప్ప వాక్యపరిచర్య జరిగించాడు. మెంటరింగ్ అంటే, "ఒక విషయం గురించి బాగా తెలిసిన వ్యక్తి దగ్గర సమాచారం లేదా వారి అభిప్రాయం తెలుసుకోవడం, వినడానికి చెవిని, సరైన దిశలో నడిపించడానికి ఒక ప్రేరణ ఇవ్వడం" అని అంటాడు జాన్ సి క్రాస్‌బి.

## తెరచి ఉంచిన గృహాలు

యుఇయస్ఐ పరిచర్యలో ఓపెన్ హోమ్స్ కీలక పాత్ర కలిగి ఉన్నాయి. గృహాలలో విద్యార్థులకు కౌన్సిలింగ్ చేయడం, మెంటరింగ్ చేయడం, కలిసి ప్రార్థించడం, వారి అక్కరలు ఎరిగి తీర్చడం వంటివి జరిగేవి. ప్రొ. ఈనాక్ గారి ఇంటిలో ప్రారంభించబడిన చిన్న బైబిల్ స్టడీని దేవుడు దేశవ్యాప్త సహవాసంగా దీవించాడు. ఇలా ఎన్నో పరలోక నమూనాలాంటి కుటుంబాలను యుఇయస్ఐ అందించింది. విద్యార్థులు, యంగ్ గ్రాడ్యుయేట్స్ ఒక మంచి మాదిరిని సీనియర్ గ్రాడ్యుయేట్స్ హోమ్స్‌లో చూడగలగాలి. ఆత్మీయ సహాయాలు పొందిన విద్యార్థులు, యంగ్ గ్రాడ్యుయేట్స్ ఈ కుటుంబాల ద్వారా స్ఫూర్తి పొంది మంచి క్రైస్తవ కుటుంబాలు కట్టుకోవాలి. వారు వెళ్ళిన ప్రాంతాలలో మంచి పరిచర్య చేయడానికి, మాదిరి గృహాలు నిర్మించుకోవడానికి ఇది దోహదం చేస్తుంది.

## సేవక నాయకత్వం

మన ముందుతరం మనకందించిన వారసత్వం సేవక నాయకత్వం. వారు బాధ్యత గల నాయకులుగా పనిచేసి, ఇతర నాయకులను సిద్ధం చేశారు, వారిని ప్రోత్సహించారు. మోషే తన నాయకత్వంలో సాత్వికుడుగా ఉండి పరిచర్య జరిగించాడు. క్రీస్తు ప్రభువు గురువైయుండి శిష్యుల పాదాలు కడిగాడు, అదేవిధంగా యుఇయస్ఐ నాయకులు సేవ చేశారు. దీనబంధు గారు నోబుల్ కాలేజీలో పనిచేస్తున్నప్పుడు హాస్టల్ విద్యార్థులు ఒక రోజు అసిస్టెంట్ వార్డెన్‌పై పెద్ద గొడవ చేశారు. దీనబంధు గారు వచ్చి వార్డెన్ గారితో మనం వాళ్ళ సేవకులం, వారికి కావలసిన విధంగా మనం భోజన ఏర్పాట్లు చేయాలి అని దీనత్వంతో చెప్పినప్పుడు, విద్యార్థులు చాలా ఆశ్చర్యపడ్డారు. మనం కలిసి పనిచేస్తున్నప్పుడు అభిప్రాయ బేధాలు తలెత్తుతూ ఉండవచ్చు. ఇతరుల అభిప్రాయలకు, ఆలోచనలకు మనం ప్రాధాన్యతనిస్తూ ఉండాలి. మనం సేవక నాయకులం అని గుర్తుంచుకోవాలి.

## దేవుని పనిలో నమ్మకత్వం

మన పెద్దలు వారికప్పగింపబడిన పనిని నమ్మకంగా జరిగించి తర్వాత జనరేషన్‌కు అప్పగించారు. ఆ వారసత్వం కొనసాగాలి. అప్పగింపబడిన పనిలో నమ్మకంగా కష్టపడిపనిచేసే సామర్థ్యం, నమ్మకం గల వ్యక్తులకు పరిచర్య అప్పగించాలి. మోషే దేవుని పనిని నమ్మకంగా జరిగించి ఒక సమయం వచ్చినప్పుడు యెహోషువకు అప్పగించాడు. మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడుగా, బహు సాత్వికుడుగా సాక్ష్యం పొందాడు. తనకు అప్పగింపబడిన మందను బహుజాగ్రత్తగా, బాధ్యతతో నడిపించాడు. డా. స్టెరట్ దంపతులు తమ సర్వస్వాన్ని దేవుని పనికి అర్పించారు. ఈ రోజు వారు యుఇయస్ఐ పరిచర్యకు అప్పగించిన స్థలం, కట్టడాలు జాతీయ స్థాయిలో ఆశీర్వాదకరంగా ఉన్నాయి. ఎన్నో వేలమంది విద్యార్థి నాయకులు కోటగిరి హైఫీల్డ్‌లో ప్రతి సంవత్సరం తర్ఫీదు పొందుతున్నారు.

## వాక్య వెలుగులో నడవడి-పరిచర్య

మన పితరులు దేవుని వాక్యానికి బహు ప్రాధాన్యతనిచ్చారు. వాక్య ప్రకారం నడుచుకొని వారసత్వంగా అందించారు. మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి అనే దేవుని ఆజ్ఞను అనుసరించి, విద్యార్థులకు సువార్త అందించారు. ఆ బాధ్యత తరువాత తరం వారికి అందించారు. సువార్త సేవ కొరకు వారి జీవితాలను వెచ్చించారు. పౌలు తన స్వీయ అనుభవాన్ని థెస్సలోనిక సంఘానికి తెలియజేస్తూ వారి యెదుట అతడు ఎట్టి జీవితం జీవించాడో, సువార్త కొరకు వారి ప్రాణములను కూడా ఇచ్చుటకు ఎట్లు సిద్ధపడియున్నారో తెలియజేశాడు (1థెస్స 2:8-10). పౌలు ఇట్టి ప్రయాసతో కూడిన పరిచర్యను తిమోతి వంటి యవ్వన సేవకులకు

తదుపరి తరాల వారికి ఒక సంపదగా విడిచి పెట్టాడు. నేషనల్ స్టాఫ్‌గా పనిచేసిన పి.సి. వర్గీస్ గారు, పి.సత్యోర్తిరావు గారు దేశంలో నలుమూలల తిరిగి సువార్త ప్రకటించారు. ఇప్పుడున్నట్లుగా ఆ దినాల్లో సరైన సదుపాయాలు లేవు.

## విశ్వాస జీవితం

యుఇయస్ఐ పరిచర్య విశ్వాసంతోనే జరుగు తుంది. పరిచర్యలోని ప్రతి అవసరత నిమిత్తం ప్రార్థన ద్వారా దేవుని వైపు చూడడమే. ఒక చిన్న రి ట్రీటు నుండి పెద్ద కాన్ఫరెన్స్ వరకు, ప్రతి అవసరం నిమిత్తం దేవుని మీదే ఆధారపడతాము. నంబూరు లో మన స్టడీ సెంటర్ బిల్డింగ్స్ కట్టడానికి మొదలు పెట్టినప్పుడు విశ్వాసంతో ప్రణాళికలు వేయడం జరిగింది. ఫస్ట్‌ఫేజ్ బిల్డింగ్స్ మొదలు పెట్టినప్పుడు నేను కూడా ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఉన్నాను. టియర్ ఫండ్ అనే విదేశీ సంస్థ వారు బిల్డింగ్ కట్టడానికి, స్వచ్ఛందంగా సొమ్ము ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అయితే దానికి ఒక రిక్వస్ట్ లెటర్ కావాల న్నారు. మన సహవాసంలో అలాంటి అభ్యర్థనలు చేయలేము. కొందరు పెద్దలు ఇచ్చిన సలహా మేరకు ఆ ప్రయత్నాన్ని విరమించుకొని ప్రార్థించినప్పుడు అద్భుతంగా విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ ప్రేమ పూర్వక కానుకలు ఇచ్చారు. తద్వారా పని ప్రారంభిం చబడి వాటిని ముగించగలిగాము.

## కాపరి పనిలో చేయాల్సినవి

1. అవసరం వచ్చినప్పుడు దేవుని వాక్యాన్ని అర్థవంతంగా బోధించడానికి సిద్ధంగా ఉండడం.
2. అందుబాటులో ఉన్న విద్యార్థి, గ్రాడ్యుయేట్ నాయకులను శిష్యులుగా సిద్ధం చేస్తూ పరిచర్యకు ప్రోత్సహించడం.
3. జీవిత సవాళ్ళను ఎదుర్కొనే విధంగా వారిని తయారు చేయడం.
4. సేవలో కావలసిన ప్రతి ఆర్థిక అవసరత నిమిత్తం దేవుని మీద ఆధారపడుతూ, దేవుని పనికి ఇవ్వడంలో ప్రాముఖ్యతను ఎరిగేటట్లు ప్రోత్సహించడం.
5. విద్యార్థి, గ్రాడ్యుయేట్ నాయకులలోని తలాంతులు వారు గుర్తెరిగేటట్లు సహాయపడడం.
6. దేవుడు పరిచర్యలో జరిగించిన కార్యాలను తర్వాతి తరానికి తెలియజేయడం (కీర్తనలు 71:18).
7. మనము సిద్ధపరచిన ఆర్టికల్స్‌ను ఇతరులకు అందించడం.
8. అవసరమైనప్పుడు దిద్దుబాటు, హెచ్చరించడం లాంటివి చేయడం.
9. ఆత్మీయ గర్వాన్ని గూర్చి జాగ్రత్త వహించేటట్లు చూడడం.
10. తప్పుడు సిద్ధాంతాలను గూర్చిన జాగ్రత్త కలిగి, ఇతరులు కూడా కలిగి ఉండేలా చూడడం.
11. క్రమశిక్షణా రాహిత్యాన్ని నిరోధించేటట్లు ప్రోత్సహించడం.
12. సంఖ్యపెరిగే కొలది దేవునిని, ఆయన కార్యాలను ఎరుగని తరం రావచ్చు. కాబట్టి జాగ్రత్త పడాలి.

## వృద్ధులకు వాగ్దానాలు

వయస్సులో పెద్దవారవుతున్నప్పుడు కొన్ని సవాళ్ళు ఎదురవుతుంటాయి. కాని దేవుడు ముసలితనంలో ఆయన తోడుగా ఉంటానని వాగ్దానాలు ఇచ్చాడు.

1. ముదిమిలో ఎత్తికొనేవాడు, చంకపెట్టుకొనేవాడు మరియు రక్షించేవాడుగా, దేవుడుగా ఉన్నాడు (యెష 46:4)
2. మేలుతో హృదయాన్ని తృప్తిపరుస్తాడు (కీర్తన 103:5)
3. ముసలితనమందు ఖర్జూరవృక్షమువలె మొవ్వ వేయుదురు, సారముకలిగి పచ్చగా ఉందురు (కీర్త92:12,15)
4. శాశ్వతుడగు దేవుడు వారికి నివాస స్థానముగా ఉండును (ద్వితీ 33:27)


దేవుని బిడ్డలమైన మనము అన్ని వయస్సుల్లో ఆయన భద్రతలో ఉంటాము. మనమున్న ప్రాంతాలలో ఉన్న ఇయు, ఇజియఫ్ సహవాసాలు మనకు ఎంతో ఆదరణగా ఉంటాయి. మనము వారికి తల్లిదండ్రుల వలె ఉంటాము.

## మన ప్రార్థన

వృద్ధాప్యమందు నన్ను విడనాడకుము. నా బలము క్షీణించినప్పుడు నన్ను విడువకుము. కీర్తన 71:9.

**– కె. యోహాను,** తుని

ఏపి–ఇజియఫ్, షెప్పర్డ్ సెల్ తరుపున



# దేవుడెందుకు బ్ర. భక్త్‌సింగ్‌ను ఇంతగా ఘనపరచాడు?

2000 సెప్టెంబర్ 17 ఉదయం 6.05 ని.లకు ముందు హైదరాబాదు చుట్టు పక్కల ఏకదాటిగా ఉరుములు, మెరుపులతో భూకంపం సంభవించింది. అదే సమయంలో 60 సం॥పైగా నమ్మకంగా సేవ జరిగించిన ఓ దైవసేవకుడు మహిమలోకి పిలు వబడ్డాడు. ఈ వార్త అడవిని కాల్చే కార్చిచ్చులా ఆంధ్రప్రదేశ్, భారతదేశం, ప్రపంచంలోని నలు మూలలా ఆ సేవకుణ్ణి యెరిగిన వారికి వ్యాపించింది. తమ ఆత్మీయతండ్రిని జ్ఞాపకం చేసుకొంటూ ఆయన్ను దర్శించుటకు, తుది వీడ్కోలు ఇవ్వడానికి శాఖ, భాష, సాంఘిక, జాతి బేధములన్నీ విడిచిన విశ్వాసులు కన్నీటి ప్రవాహంతో తరలి వచ్చారు.

2000 సెప్టెంబర్ 22, శుక్రవారం రోజున ఆ సేవకుడు 1950 నుండి స్వగృహంగా భావించిన హైదరాబాద్‌లోని 'హెబ్రోను' పరిసర ప్రాంతాల్లో ప్రజలు జన సముద్రంగా ఉన్నారు. ఈ జన సంఖ్య రెండున్నర లక్షలు ఉండవచ్చని అంచనా.

అదే రోజు ఉదయం 11:30 నిలకు ఆ దైవసేవకుని భౌతికకాయంను భూస్థాపన నిమిత్తం తరలిస్తూ ఉండగా ప్రకృతిలో అనేక వింతలు జరిగాయి. ఆకాశంలో ప్రకాశమైన ధనస్సు సూర్యుని చుట్టూ ఏర్పడడం, అది అదృశ్యమై సూర్యుని చుట్టూ కిరీటం వలె మెరిసే ఓ వలయం ఏర్పడడం, ఊరేగింపు ప్రారంభంకాగానే వందలకొద్ది పావురాలు హెబ్రోను ఆవరణంలో ఎగరడం స్థానికులను, అక్కడ చేరిన ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. హెబ్రోను నుండి భూస్థాపన చేయు స్థలం వరకు గల మూడు కిలోమీటర్ల దూరం చేరడానికి మూడు గంటలు పట్టింది. దు:ఖభరితమైన హృదయాలతో పరిశుద్ధులు తమ తమ బైబిళ్ళు చేతపట్టుకొని, వాక్యం వ్రాసిన బేనర్స్‌ను పట్టుకొని దేవుణ్ణి స్తుతిస్తూ, పాటలు పాడుచూ ముందుకు వెళ్ళడం హైదరాబాదు ప్రజలకు నిజంగా ఓ గొప్ప షాక్.

మహిమలోకి వెళ్ళిన తర్వాత ఇంతటి ఘనత లభించిన ఆ దైవసేవకుడు ఎవరోకాదు, బ్ర. భక్త్‌సింగ్. 70 సం॥ల క్రితం ఒక సాధారణ బోధకునిగా పరిచర్యను ప్రారంభించిన ఈ దైవజనుని యెడల ఇంత ప్రేమ, కన్నీరు, ఘనతకు కారణం ఏంటి? దేవుడెందుకు బ్ర. భక్త్‌సింగ్‌ను ఇంతగా ఘనపరచాడు? దీనికి కారణాలు అనేకం కానీ ఆయన జీవితంలోని ఏడు విషయాలు మాత్రం గమనించగలం.

### 1. ఇతడు భూమిలో పడి చనిపోవడానికి ఇష్టపడిన గోధుమగింజ

1930 సం॥లో ప్రభువు సంపూర్ణ సేవకు పిలిచినప్పుడు మొదట నిరాకరించి తర్వాత సాకులు చెప్పకుండా ప్రభువు పిలుపుకు లోబడ్డాడు. 'సంపూర్ణ సమర్పణ-సేవ' అనే అంశంపై మాట్లాడుతూ తాను ఏవిధంగా రెండు సం॥లు పరిశుద్ధాత్ముని సంధింపుకు వ్యతిరేఖంగా నిలిచి, ఆత్మీయంగా ఎంతనష్టం పొందాడో జ్ఞాపకం చేసుకొని దుఖి:ంచాడు. ఏ విషయంలో ప్రభువుకు లోబడకుండా ఉంటున్నారో

అలాంటి వారితో దేవుడు మాట్లాడుచున్నాడు 'మిమ్మును మీరు ప్రభువుకు అప్పగించుకోండి అని చెప్పాడు. తన్ను తాను ప్రభువు కొరకు వ్యయపరచుకొన్న గొప్ప దైవజనుడు.

**2. తన యజమానుని అడుగు జాడల్లో నడిచాడు**

'జీవముగల క్రీస్తును' మహిమపరచడమే అతని అత్యుత్తమకోరిక. తన స్నేహితులను, బంధువులను ఎన్నడూ మెప్పించడానికి ప్రయత్నించలేదు. 1959లో అమెరికాకు వెళ్ళినప్పుడు వెంట్రుకలు కత్తిరించుకోవాల్సి వచ్చినప్పుడు ప్రభువు అనుమతితో వెళ్ళిన ఫలితంగా ఆ షాపు యజమాని బ్రూస్ క్రీస్తును అంగీకరించాడు. 1978లో అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో బోధించమని ఆహ్వానం అందినప్పుడు ఆయన ప్రార్థన చేసుకొని సమాధానం లేదని చెప్పాడు. అది వైట్‌హౌస్ అయినా బ్లాక్‌హౌస్ అయినా దేవుని అనుమతిలేనిదే వెళ్ళేది లేదని ఖరాఖండిగా చెప్పాడు.

**3. తన స్వంత ప్రాణంకంటే ప్రభువును ఎక్కువగా ప్రేమించాడు**

70 సం॥ల క్రైస్తవ జీవితంలో కుటుంబస్థులనుగానీ, వృత్తినిగానీ దేనినీ ప్రేమించలేదు. సమస్తం క్రీస్తుకొరకు విడిచిపెట్టి నమ్మకంగా సేవించాడు. నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభము' అని చెప్పగలిగాడు, మాదిరి చూపించాడు.

**4. తన ప్రాణంను తనకెంతమాత్రం ప్రియముగా ఎంచుకోలేదు**

తన గురించి, తన అవసరాలగురించి ఎన్నడూ చింతించక ప్రభువు కొరకు అందుబాటులో ఉన్నాడు. తన యజమానుని పని నిమిత్తం సమయాన్ని, కన్నీటిని, చెమటను ధారపోశాడు. ఎప్పుడూ సణగలేదు, వ్యక్తులకు, పరిస్థితులకు భయపడలేదు.

**5. ఆనందంతో తన పరుగును తుదముట్టించాడు**

OM స్థాపకుడైన జార్జి వర్వర్ 1991వ సం॥లో బ్ర. భక్త్‌సింగ్‌ను గురించి ఇలా చెప్పాడు. "బ్ర. భక్త్‌సింగ్ తన పరుగును కడముట్టించెను. అతని గురించి శ్రేష్టమైన సంగతి ఏమనగా అంతము వరకు తన పరుగును కొనసాగించెను".

**6. ప్రభువుచే పొందిన పరిచర్యను సంపూర్ణంగా చేసెను**

ప్రభువు తనకిచ్చిన దర్శనాన్ని బట్టి, 1941లో



కూనూరులో బ్ర. భక్త్‌సింగ్ ఈ విధంగా తీర్మానించుకొన్నాడు. 'ప్రభువా నీ చిత్తము నెరవేర్చడానికి నేనెంత క్రయమైనా చెల్లిస్తాను" ప్రభువు చిత్తమునకు విధేయుడై క్రొత్తనిబంధనలోని నియమానుసారంగా భారతదేశంలో, ఇతరదేశంలోనూ స్థానిక సంఘాలు ఏర్పాటు చేసి 'పరలోక దర్శనమునకు అవిధేయుడను కాలేదు' అని చెప్పెను.

**7. మాదిరికరమైన తన జీవితం ద్వారా దేవుని కృపను వెల్లడి చేశాడు**

బ్ర. భక్త్‌సింగ్, ఆసియా ఖండంలో వేలమందికి ఆత్మీయ తండ్రిగాను, ప్రపంచంలోఉన్న విశ్వాసులకు మాదిరిగాను, ప్రోత్సాహకరంగాను నిలిచాడు. బ్రిటిష్ సంఘ చరిత్రకారుడు జె. ఎడ్విన్ ఓర్ ఈవిధంగా చెప్పాడు. "బ్ర. భక్త్‌సింగ్ ఒక ప్రాంతమునకే చెందిన బోధకుడుగాక భారతదేశమంతటికీ సువార్తికుడయ్యాడు. విదేశాలలోని సువార్తికులతో సరిపోల్చదగ్గ భారతీయ సువార్తీకుడు. ఫిన్నే అంతటి నేర్పు కలిగి, మూడీ వలె నేరుగా, సూటిగా బోధించేవాడు. క్యాంబెల్ మోర్గాన్, గ్రహం స్క్రాగీ వరుసనున్న మొదటి తరగతి బైబిల్ బోధకుడు".

మానవ బలహీనతలు మరియు హద్దులు న్నప్పటికీ అసాధారణ కార్యములను జరిగించుటకు, అనేక సంఘాలను స్థాపించుటకు ప్రభువు బ్ర. భక్త్‌సింగ్‌ను వాడుకొనెను. అందుకే ఈయన 20వ శతాబ్దపు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నూతన నిబంధన సంఘస్థాపకుడు అని అంటారు.

రిఫరెన్స్: బ్ర. భక్త్‌సింగ్, టి.ఇ.కోషి, ఓయం. బుక్స్ సికింద్రాబాద్

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-06-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ఔను... మేమింతే

మా కంట్లో దూలాలు ఉన్నా
ఇతరుల నేత్రాల్లో
నలుసులు వెదకాలని
భూతద్దాల సంచిని
భుజాన వేసుకొని
తిరుగుతూ ఉంటాం!

ఎవ్వరికీ తెలియకుండా
ఎడారి ఓడల్ని మింగుతుంటాం
అందరూ చూసేటప్పుడు
దోమలను కూడా వడగట్టి
మా అంత పరిశుద్ధులు
లేరనిపిస్తాం!
రహస్యాలన్నీ ఎరిగిన దేవున్ని
మబ్బుల చాటున దాచి
మర్చిపోతుంటాం!

పాత్రని పైపైనే కడుక్కుంటాం
పాచిపట్టి వాసన వస్తున్నా
లోపల మాత్రం శుద్ధి చేయం
బయటేమో...ఆహా అనిపించే
అలంకారం
అంతరంగమంతా అంతులేని దుర్గంధం
సున్నం కొట్టిన సమాధులే
మాకు ఆదర్శం!

సాయం చేసినోడికి
గాయం చేయడానికి
అస్సలు ఆలోచించం
తిన్నింటి వాసాలు
లెక్కపెట్టడంలో
మాకు మేమే సాటి!

నరం లేని నాలుకతో
ఎంతైనా ప్రేమిస్తాం
క్రియలలో చూపించాలంటే
మాయచేసి మాయమైపోతాం
అందమైన అబద్దాలు
చందనంలా వాడేస్తాం!

స్టేజీల కోసం రాజీపడే
గొప్పల కోసం తిప్పలుపడే
అంత్యకాల పరిసయ్యులం
తీర్పు ఉందని తెలిసినా
మార్పులేని వేషధారులం!
ఔను... మేమింతే

– గొంగటి మేరి జాయ్, ఆదోని